ప్రభాత కిరణం
సత్యానికి వారధి
PRGI REGD NO.: TGTEL/26/A4986
అమరావతి | సంపుటి : 1 | సంచిక : 20 | మంగళవారం 14-07-2026 | పేజీలు : 8 | వెల : రూ. 4/-
www.prabhathakiranam.com
Amaravathi | Volume : 1 | Issue : 20 | Tuesday 14-07-2026 | Pages : 8 | Price : Rs. 4/-
Circulated to Telangana Published from Medchal Malkajgiri

# ప్రాజెక్టు పురోగతిపై ఆరా

## పోలవరం పనులపై సీఎం ఫోకస్.. క్షేత్రస్థాయిలో చంద్రబాబు సమీక్ష



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా ప్రాజెక్టు వ్యూ పాయింట్ నుంచి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, శాఖ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, శాఖ సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిని సీఎంకు వివరించారు. తర్వాత ఈసీఆర్ఎఫ్ గ్యాప్-1, గ్యాప్-2, హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ హౌస్ సహా కీలక నిర్మాణ ప్రాంతాలను చంద్రబాబు సందర్శించారు.

### గోదావరి డెల్టాకు


# శాశ్వత రక్షణ

ధవళేశ్వరం బ్యారేజీకి కొత్త ఊపు

ఇరిగేషన్‌పై భారీ పెట్టుబడులు

రైతు భరోసాకు చంద్రబాబు హామీ

- 2లో...



- 5లో...

### విద్యార్థులకు శుభవార్త..

# ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్

**ఏపీలో మరో 175 ఎంబీబీఎస్ సీట్లు**


**ప్రభుత్వ మెడికల్ విద్యకు ఊతం**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో చేరాలనుకునే విద్యార్థులకు శుభవార్త అందింది. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) మరో 175 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతి ఇచ్చింది. దీంతో ఈ ఏడాది కొత్తగా మంజూరైన ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 325కు చేరింది. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య విద్య విస్తరణకు ఇది కీలక అడుగుగా ప్రభుత్వం భావిస్తోంది.

# వియత్నాం బోటు విషాదం

స్వదేశానికి 15 మృతదేహాలు

దర్యాప్తులో ప్రమాద రహస్యం



- 3లో...

# ఆవుల వధకు బ్రేక్

**మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులకు సుప్రీంకోర్టు స్టే**

**మొత్తం వ్యవహారంపై సుప్రీంకోర్టు జోక్యం**



- 2లో...

తమిళనాడులో ఆవులు, దూడల వధపై రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయి నిషేధం విధించాలని మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు సుప్రీంకోర్టు తాత్కాలికంగా స్టే ఇచ్చింది. ఈ అంశంపై తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన ప్రత్యేక పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వుల్లో ప్రాథమికంగా సవరణ అవసరం ఉందని అభిప్రాయపడింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సంపూర్ణ నిషేధాన్ని అమలు చేయాలన్న ఆదేశాలపై స్టే విధిస్తూ ప్రభుత్వ వాదనలను పరిశీలించేందుకు నోటీసులు జారీ చేసింది.

# విమాన ఛార్జీల దోపిడీకి చెక్

**టికెట్ ధరలపై నిబంధనలు.. రెండు వారాల్లో సమర్పించాలి**

**కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీంకోర్టు**

పండుగలు, అత్యవసర పరిస్థితులు, చివరి నిమిషంలో ప్రయాణం చేయాల్సి వచ్చినప్పుడు విమాన టికెట్ ధరలు అమాంతం పెరగడం ప్రయాణికులకు ఎన్నో ఏళ్లుగా భారంగా మారింది. అవసరాన్ని ఆసరాగా చేసుకుని విమానయాన సంస్థలు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నాయనే విమర్శలు తరచూ వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సామాన్య ప్రయాణికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సుప్రీంకోర్టు కీలకంగా జోక్యం చేసుకుంది. టికెట్ ధరలను నియంత్రించే కొత్త నిబంధనలను రెండు వారాల్లో సమర్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో విమాన ఛార్జీల్లో పారదర్శకత పెరగడం, అనవసర ధరల పెంపుకు అడ్డుకట్ట పడడం, ప్రయాణికులకు కొంత ఊరట లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

- 3లో...

# వైరల్ వీడియోలకు చెక్



## గొడవలే లేవు.. అంతా ఒక్కటే

## డ్యాన్సర్లకు రూ.18 లక్షల విరాళం



సినిమా సెట్స్‌పై స్టెప్పులు పడితే ప్రేక్షకులు చప్పట్లతో హోరెత్తిస్తారు. అదే డ్యాన్స్ కుటుంబంలో విభేదాల వార్తలు బయటకు వస్తే అభిమానుల్లో సందేహాలు మొదలవుతాయి. అలాంటి వైరల్ ప్రచారాలకు జానీ మాస్టర్ ఒక్క మాటతో ఫుల్ స్టాప్ పెట్టారు. శేఖర్ మాస్టర్‌తో తనకు ఎలాంటి గొడవ లేదని, సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన వీడియోలను తప్పుగా అర్థం చేసుకున్నారని స్పష్టం చేశారు. అసోసియేషన్ సమావేశంలో జరిగినది సాధారణ అంతర్గత చర్చ మాత్రమేనని, దాన్ని వివాదంగా చిత్రీకరించడం బాధాకరమన్నారు. డ్యాన్స్ ప్రపంచంలో పోటీ ఉండొచ్చు కానీ మనసుల్లో దూరం లేదని చెప్పారు. అంతేకాదు, మాటలకే పరిమితం కాకుండా డ్యాన్సర్ల సంక్షేమం కోసం తన పారితోషికంలో వచ్చిన రూ.18 లక్షలను ఆరోగ్య బీమాకు విరాళంగా ప్రకటించి మరోసారి తన పెద్ద మనసు చాటుకున్నారు. రామ్ చరణ్ అందించిన సహాయంతో పాటు ఈ విరాళం డ్యాన్సర్లకు భరోసాగా నిలవనుంది.

- 2లో...



- 6లో...

# మహా సర్కార్ ఎన్నికల హామీలు

## ముందు నుయ్యి.. వెనుక గొయ్యి

'లాడ్కీ బహిన్'లో 92 లక్షల మందికి షాక్

లబ్ధిదారుల జాబితాలో భారీ మార్పు

ఎన్నికల వేళ సంక్షేమ హామీలతో ప్రజలను ఆకట్టుకున్న మహారాష్ట్ర ప్రభుత్వం, ఇప్పుడు అదే పథకంలో భారీ కోతలు విధించడం రాజకీయ దుమారం రేపుతోంది. మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని ప్రకటించిన 'మాజీ లాడ్కీ బహిన్ యోజన'లో ఏకంగా 92 లక్షల మంది లబ్ధిదారుల పేర్లను తొలగించడం తీవ్ర చర్చకు దారితీసింది. ఎన్నికల ముందు అందరికీ వర్తిస్తుందన్న హామీ, ఎన్నికల తర్వాత అర్హతల పేరుతో భారీ వడపోత జరగడం విమర్శలకు తావిస్తోంది. ఇది నిజంగా అర్హుల గుర్తింపా? లేక ఎన్నికల హామీలకు పరిమితులున్నాయనే సంకేతమా? అనే ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లోనే కాదు, దేశవ్యాప్తంగా సంక్షేమ పథకాల అమలుపైనా చర్చకు కారణమవుతున్నాయి.

**ఎవరి ధీమా వారిది!**

# సీమ ఎమ్మెల్సీ సీటు ఎవరిది?

## రాయలసీమ ఎమ్మెల్సీ రేస్.. ఎవరికీ రాజకీయ వరం?

## ఒకే సీటు కోసం పోటీ... రాయలసీమలో పెరిగిన ఉత్కంఠ




తెలుగుదేశం పార్టీలో గవర్నర్ కోటాలో భర్తీ కానున్న రెండు ఎమ్మెల్సీ స్థానాలపై రాజకీయ ఉత్కంఠ రోజురోజుకూ పెరుగుతోంది. అందులో ఒక స్థానం ఉత్తరాంధ్రకు వెళ్లే అవకాశాలు కనిపిస్తుండగా, మిగిలిన ఒక్క స్థానంపై రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. సీనియర్ నాయకులకు గుర్తింపు ఇవ్వాలా, ఎన్నికల్లో పార్టీ కోసం త్యాగం చేసిన విధేయులకు ప్రాధాన్యం కల్పించాలా, భవిష్యత్ నాయకత్వాన్ని ప్రోత్సహించాలా, సామాజిక సమతుల్యతకు పెద్దపీట వేయాలా అనే అనేక కోణాల్లో అధిష్టానం కసరత్తు చేస్తోంది. కడప, అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు చెందిన పలువురు ప్రముఖుల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ఒక్క ఎమ్మెల్సీ స్థానం కోసం సాగుతున్న ఈ రాజకీయ పోటీ కేవలం నామినేటెడ్ పదవి వరకే పరిమితం కాదు. రాయలసీమలో భవిష్యత్ రాజకీయ సమీకరణాలు, జిల్లా నాయకత్వం, 2029 ఎన్నికల వ్యూహానికి దిశానిర్దేశం చేసే నిర్ణయంగా ఇది మారింది. అందుకే టీడీపీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న ఆసక్తి పార్టీ శ్రేణులతో పాటు రాజకీయ వర్గాల్లోనూ నెలకొంది.

- 7లో...

ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణం పూర్తికి చేరువలో ఉన్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక అనుమతి ఇచ్చింది. ఈ విమానాశ్రయాన్ని అధికారిక ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్ట్‌గా ప్రకటిస్తూ కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది.

- 2లో...



# భోగాపురం ఎయిర్‌పోర్టుకు కీలక అనుమతి

## అంతర్జాతీయ సేవలకు గ్రీన్ సిగ్నల్

## ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్ట్ హోదా ఇచ్చిన కేంద్రం

# అవినీతి ఆరోపణలు

## హత్య కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం




### బుచ్చిరెడ్డిపాలెం పీఎస్ ఖాళీ.. ఎస్పీ సంచలన నిర్ణయం.. ఒక్కసారిగా 23 మంది బదిలీ

నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న మొత్తం 23 మంది సిబ్బందిని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల బదిలీ చేశారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావును వెకెన్సీ రిజర్వ్‌కు పంపించారు. ఒకేసారి మొత్తం పోలీస్ స్టేషన్ సిబ్బందిపై బదిలీ చర్యలు తీసుకోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల వెలుగులోకి వచ్చిన ఓ అనుమానాస్పద మృతి కేసు దర్యాప్తులో విధుల పట్ల నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కొత్త మినగల్లు గ్రామానికి చెందిన మండల వ్యవసాయ అధికారి నడవాటి శ్రీహరి జూలై 6న అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందారు. ఆయన భార్య లావణ్య తన భర్త మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే ఎస్పీ సమగ్ర దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేశారు. నెల్లూరు రూరల్ ఎస్‌డీపీవో ఘట్టమనేని శ్రీనివాసరావు స్వయంగా విచారణ పర్యవేక్షించారు. సాక్షులు, కుటుంబ సభ్యులు, కీలక వ్యక్తులను విచారించి ఆధారాలు సేకరించారు. విచారణలో లభించిన సమాచారంతో గోలగమూడికి చెందిన సోంపల్లి రవీంద్ర, రామతీర్థానికి చెందిన బుచ్చింగారి యానాదయ్యను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారించిన తర్వాత కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా టీపీ గూడూరు మండలం రావూరివారి కండ్రిగ గ్రామానికి చెందిన కుడుముల హరికృష్ణను పోలీసులు గుర్తించారు. మృతుడికి హరికృష్ణ బావమరిది అవుతాడని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం అతడు పరారీలో ఉండటంతో ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.



- 5లో...

# పవన్‌ను పరామర్శించిన మహారాష్ట్ర సీఎం

**ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్యంపై ఆరా తీసిన ఫడ్నవీస్**


ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ముంబైలోని ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న చికిత్స గురించి వివరాలు తెలుసుకుంటూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



# ప్రాజెక్టు పురోగతిపై ఆరా

**పోలవరం పనులపై సీఎం ఫోకస్.. క్షేత్రస్థాయిలో చంద్రబాబు సమీక్ష**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా ప్రాజెక్టు వ్యూ పాయింట్ నుంచి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, శాఖ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, శాఖ సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిని సీఎంకు వివరించారు. తర్వాత ఈసీఆర్ఎఫ్ గ్యాప్–1, గ్యాప్–2, హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ హౌస్ సహా కీలక నిర్మాణ ప్రాంతాలను చంద్రబాబు సందర్శించారు. ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ద్వారా పనుల పురోగతిని పరిశీలించారు. ప్రతి దశపై అధికారులను ప్రశ్నిస్తూ పనులు మరింత వేగంగా పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ప్రాజెక్టు నిర్మాణం నిర్ణయించిన గడువులో పూర్తి కావాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో రాష్ట్ర మంత్రులు, జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ బృందం పాల్గొన్నారు. నిర్మాణ పనుల నాణ్యత, పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు. పోలవరం ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసి రాష్ట్రానికి అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.



# ఆవుల వధకు బ్రేక్

**మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులకు సుప్రీంకోర్టు స్టే**

**మొత్తం వ్యవహారంపై సుప్రీంకోర్టు జోక్యం**



తమిళనాడులో ఆవులు, దూడల వధపై రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయి నిషేధం విధించాలని మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు సుప్రీంకోర్టు తాత్కాలికంగా స్టే ఇచ్చింది. ఈ అంశంపై తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన ప్రత్యేక పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వుల్లో ప్రాథమికంగా సవరణ అవసరం ఉందని అభిప్రాయపడింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సంపూర్ణ నిషేధాన్ని అమలు చేయాలన్న ఆదేశాలపై స్టే విధిస్తూ ప్రభుత్వ వాదనలను పరిశీలించేందుకు నోటీసులు జారీ చేసింది.

**చట్టానికి విరుద్ధమన్న ప్రభుత్వ వాదన**

తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించిన వాదనల్లో కీలక అంశాలను ప్రస్తావించింది. 1958లో అమల్లోకి వచ్చిన తమిళనాడు జంతు సంరక్షణ చట్టం ప్రకారం పదేళ్లు దాటిన ఆవులు పని చేయడానికి, సంతానోత్పత్తికి అనర్హమని అధికారం కలిగిన అధికారులు ధృవీకరిస్తే వాటి వధకు అనుమతి ఉందని తెలిపింది. అలాంటి చట్టం అమల్లో ఉండగా పూర్తి నిషేధం విధించాలని హైకోర్టు ఆదేశించడం చట్టపరంగా సరైంది కాదని స్పష్టం చేసింది.

**నియంత్రణ మాత్రమే.. సంపూర్ణ నిషేధం కాదు**

జంతువులపై క్రూరత్వం నివారణ చట్టం–1960, స్లాటర్ హౌస్ నిబంధనలు–2001, తమిళనాడు అర్బన్ లోకల్ బాడీస్ చట్టం–1998, తాజా నిబంధనలు--2023 ప్రకారం వధను పూర్తిగా నిషేధించలేదని ప్రభుత్వం వివరించింది. నిర్ణీత ప్రాంతాలు, లైసెన్స్ పొందిన స్లాటర్ హౌస్‌లలో మాత్రమే వధ జరగాలని నిబంధనలు ఉన్నాయని తెలిపింది. బహిరంగ ప్రదేశాల్లో జంతువుల వధను అడ్డుకునేందుకు ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నామని కూడా వెల్లడించింది.

**హైకోర్టు వ్యాఖ్యలపై అభ్యంతరం**

హైకోర్టు ఒకవైపు నిర్ణీత స్లాటర్ హౌస్‌లలో మాత్రమే వధ జరగాలని చెప్పి, మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయి నిషేధం విధించాలని ఆదేశించడం పరస్పర విరుద్ధమని తమిళనాడు ప్రభుత్వం వాదించింది. ఇది న్యాయవ్యవస్థ చట్టాలను రూపొందించినట్టేనని పేర్కొంది. చట్టసభ నిర్ణయించే అంశంలో కోర్టు జోక్యం చేసుకుందని అభిప్రాయపడింది.

**బక్రీద్ పిటిషన్‌తో ప్రారంభమైన వివాదం**

బక్రీద్ సందర్భంగా తాత్కాలిక షెడ్లలో ఆవుల వధకు స్థానిక అధికారులు అనుమతిస్తున్నారని ఆరోపిస్తూ కోయంబత్తూరుకు చెందిన కే. సూర్య హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీకి రాష్ట్రంలో ఎక్కడా ఆవులు, దూడల వధ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. 1976లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుకు చట్టబలం ఉందని కూడా పేర్కొంది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ప్రస్తుతం హైకోర్టు ఉత్తర్వుల అమలును నిలిపివేసింది. కేసుపై తదుపరి విచారణలో రాష్ట్ర చట్టాలు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 48, గత ప్రభుత్వ ఉత్తర్వులు, అమల్లో ఉన్న నిబంధనలపై సమగ్రంగా పరిశీలన జరగనుంది. ఈ కేసు తీర్పు తమిళనాడుకే కాకుండా దేశంలోని పశువధ చట్టాల అమలుపై కూడా ప్రభావం చూపే అవకాశముందని న్యాయ వర్గాలు భావిస్తున్నాయి.

# గోదావరి డెల్టాకు శాశ్వత రక్షణ

**ధవళేశ్వరం బ్యారేజీకి కొత్త ఊపు**

**ఇరిగేషన్‌పై భారీ పెట్టుబడులు**

**రైతు భరోసాకు చంద్రబాబు హామీ**




గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రూ.152.95 కోట్ల వ్యయంతో 117 కొత్త గేట్ల ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. వచ్చే ఏడాది జూన్ నాటికి గేట్ల బిగింపు పనులు పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాల కంటే ముందే పనులు పూర్తవుతాయని అధికారులు సీఎంకు హామీ ఇచ్చారు.

**డెల్టాకు శాశ్వత రక్షణ**

ధవళేశ్వరం బ్యారేజీ గోదావరి డెల్టాకు జీవనాడిగా నిలిచిందని చంద్రబాబు చెప్పారు. ఈస్టర్న్, సెంట్రల్, వెస్టర్న్ డెల్టాల్లో కలిపి 10.13 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందని గుర్తు చేశారు. ఐదు దశాబ్దాలుగా ఉపయోగిస్తున్న గేట్లు, మోటార్లు, విద్యుత్ వ్యవస్థలు పాతబడటంతో ఆధునీకరణ అత్యవసరమైందన్నారు. కాల్వల చివరి భూముల వరకు నీరు చేరేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**ఇరిగేషన్‌కు రూ.24 వేల కోట్లు**

గత రెండేళ్లలో సాగునీటి రంగానికి రూ.24 వేల కోట్లు ఖర్చు చేసినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రకటించిన క్యాలెండర్‌కు అనుగుణంగానే అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు ప్రస్తుతం 89 శాతం పూర్తయిందని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేదని పేర్కొన్నారు. నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.

**రైతులకు అండగా ప్రభుత్వం**

ఒకప్పుడు కోనసీమ రైతులు క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి ఉండేదని చంద్రబాబు గుర్తు చేశారు. ప్రస్తుతం రైతులు విక్రయించిన ధాన్యానికి 24 గంటల్లోనే నగదు ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. అన్నదాత సుఖీభవ వంటి పథకాల ద్వారా రైతులకు పూర్తి భరోసా కల్పిస్తున్నామని వెల్లడించారు. పోలవరం పూర్తయితే గోదావరి జిల్లాల్లో నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని తెలిపారు.

**అభివృద్ధితో పాటు పర్యాటకానికి ప్రాధాన్యం**

గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని సీఎం చెప్పారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో రూ.1,200 కోట్లతో మౌలిక వసతులు అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. పిచ్చుకలంక, బొబ్బర్లంకలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. కోనసీమకు రైల్వే మార్గం తీసుకురావడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. కొవ్వూరులో కోకో సిటీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

**గొడ్డలి పార్టీపై తీవ్ర విమర్శలు**

రాష్ట్రంలో అభివృద్ధికి అడ్డంకులు సృష్టించేందుకు గొడ్డలి పార్టీ ప్రయత్నిస్తోందని చంద్రబాబు ఆరోపించారు. డబ్బులు ఇచ్చి అరాచకాలు చేయిస్తున్నారని విమర్శించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఆయన కుటుంబ సభ్యులను కూడా అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసే వారిపై, సోషల్ మీడియాను దుర్వినియోగం చేసే వారిపై, గంజాయి, రౌడీయిజాన్ని ప్రోత్సహించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం, రాష్ట్ర పునర్నిర్మాణమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి మరోసారి వెల్లడించారు.

# భోగాపురం ఎయిర్‌పోర్టుకు కీలక అనుమతి

**అంతర్జాతీయ సేవలకు గ్రీన్ సిగ్నల్**

**ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్ట్ హోదా ఇచ్చిన కేంద్రం**

ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణం పూర్తికి చేరువలో ఉన్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక అనుమతి ఇచ్చింది. ఈ విమానాశ్రయాన్ని అధికారిక ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్ట్‌గా ప్రకటిస్తూ కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలకు అవసరమైన చట్టపరమైన ప్రక్రియలు నిర్వహించేందుకు మార్గం సుగమమైంది. విమానాశ్రయం కార్యకలాపాల ప్రారంభానికి ఇది కీలక మైలురాయిగా అధికారులు పేర్కొంటున్నారు.

**అంతర్జాతీయ ప్రయాణాలకు పూర్తి సన్నాహాలు**

ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్ట్ హోదా లభించడంతో విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులు, విదేశాలకు వెళ్లే ప్రయాణికుల పాస్‌పోర్టు ధృవీకరణ, వీసా పరిశీలన, భద్రతా తనిఖీలు అధికారికంగా నిర్వహించే అవకాశం ఏర్పడింది. భారత ఇమ్మిగ్రేషన్ చట్టాల ప్రకారం అవసరమైన అన్ని ప్రక్రియలు ఈ విమానాశ్రయంలోనే పూర్తి చేయవచ్చు. అంతర్జాతీయ విమాన సర్వీసుల నిర్వహణకు ఈ అనుమతి తప్పనిసరి.

**ఇప్పటికే ఏరోడ్రోమ్ లైసెన్స్**

కొద్ది రోజుల క్రితమే కేంద్ర పౌర విమానయాన శాఖ భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి ఏరోడ్రోమ్ లైసెన్స్ మంజూరు చేసింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఢిల్లీలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ప్రతినిధులకు లైసెన్స్ అందజేశారు. దీంతో వాణిజ్య విమాన సర్వీసులు ప్రారంభించేందుకు విమానాశ్రయం సిద్ధంగా ఉందనే సంకేతాలు స్పష్టమయ్యాయి.




**ఉత్తరాంధ్రకు విమాన కేంద్రం**

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర ప్రాంతానికి ప్రధాన విమాన కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. ఏడాదికి సుమారు నాలుగు కోట్ల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యంతో ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. 78 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మిస్తున్న టెర్మినల్‌కు ఎగిరే చేప ఆకారంలో ప్రత్యేక రూపకల్పన చేశారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా అంతర్గత నిర్మాణాన్ని రూపొందిస్తున్నారు.

**విశాఖకు తోడుగా కొత్త అవకాశాలు**

భోగాపురం విమానాశ్రయం ప్రారంభమైన తర్వాత విశాఖపట్నం విమానాశ్రయంపై ఉన్న రద్దీ గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు మరింత విస్తరించనున్నాయి. ఉత్తరాంధ్రలో పర్యాటకం, పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ రంగాలకు కొత్త ఊపు లభించనుంది. విదేశీ పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. భోగాపురం విమానాశ్రయానికి వరుసగా లభిస్తున్న అనుమతులు ప్రాజెక్టు పూర్తి స్థాయి ప్రారంభానికి మార్గం సుగమం చేస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.



**విద్యార్థులకు శుభవార్త..**

# ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్

**ఏపీలో మరో 175 ఎంబీబీఎస్ సీట్లు**

**ప్రభుత్వ మెడికల్ విద్యకు ఊతం**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో చేరాలనుకునే విద్యార్థులకు శుభవార్త అందింది. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) మరో 175 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతి ఇచ్చింది. దీంతో ఈ ఏడాది కొత్తగా మంజూరైన ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 325కు చేరింది. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య విద్య విస్తరణకు ఇది కీలక అడుగుగా ప్రభుత్వం భావిస్తోంది.

**పిడుగురాళ్లకు 100.. విజయవాడకు 75**

ఎన్ఎంసీ తాజాగా పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలకు 2026––27 విద్యా సంవత్సరం నుంచి 100 ఎంబీబీఎస్ సీట్లను మంజూరు చేసింది. విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కళాశాలకు అదనంగా 75 సీట్లు కేటాయించింది. ఈ రెండు కళాశాలలకు సంబంధించిన అనుమతి పత్రాలను ఎన్ఎంసీ సోమవారం జారీ చేసింది. దీంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త సీట్లలో ప్రవేశాలు చేపట్టనున్నారు. ఇప్పటికే కడప, నెల్లూరు, పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు కూడా అదనపు ఎంబీబీఎస్ సీట్లను ఎన్ఎంసీ మంజూరు చేసింది. తాజాగా ప్రకటించిన 175 సీట్లతో కలిపి ఈ ఏడాది మొత్తం 325 కొత్త సీట్లు రాష్ట్రానికి లభించాయి. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలకు ఇది ఫలితమని వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది.

**విద్యార్థులకు భారీ ప్రయోజనం**

టీడీపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు మొత్తం 505 కొత్త ఎంబీబీఎస్ సీట్లు రాష్ట్రానికి లభించాయి. తాజా పెంపుతో ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 7,090కు చేరుకుంది. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో మరిన్ని అవకాశాలు అందుబాటులోకి రావడంతో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు పెద్ద ఊరట లభించనుంది. కొద్దిపాటి ర్యాంకు తేడాతో గతంలో ప్రభుత్వ సీట్లు కోల్పోయిన వారికి కూడా ఇప్పుడు వైద్య విద్యలో ప్రవేశించే అవకాశం పెరగనుంది. దీంతో ఖరీదైన ప్రైవేట్ మెడికల్ కళాశాలలపై ఆధారపడాల్సిన అవసరం గణనీయంగా తగ్గే అవకాశముందని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది.

# పవన్‌ను పరామర్శించిన మహారాష్ట్ర సీఎం

**ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్యంపై ఆరా తీసిన ఫడ్నవీస్**



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ముంబైలోని ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న చికిత్స గురించి వివరాలు తెలుసుకుంటూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఆస్పత్రికి వచ్చి పరామర్శించినందుకు దేవేంద్ర ఫడణవీస్‌కు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు కొంతసేపు ఆత్మీయంగా మాట్లాడుకున్నట్లు సమాచారం. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నట్లు తెలుస్తోంది. శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైందని, ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆయన సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. వైద్యుల సూచనల మేరకు పూర్తిగా విశ్రాంతి తీసుకుంటున్నారని తెలిపాయి. పవన్ త్వరగా కోలుకుని తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని అభిమానులు, జనసేన శ్రేణులు ఆకాంక్షిస్తున్నాయి.





# వైరల్ వీడియోలకు చెక్

**గొడవలే లేవు.. అంతా ఒక్కటే**

**డ్యాన్సర్లకు రూ.18 లక్షల విరాళం**

తెలుగు సినిమా టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ సమావేశం తర్వాత సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలపై జానీ మాస్టర్ స్పష్టత ఇచ్చారు. తనకు శేఖర్ మాస్టర్‌కు మధ్య ఎలాంటి విభేదాలు లేవని తేల్చిచెప్పారు. సమావేశంలో కొన్ని అంతర్గత అంశాలపై చర్చ మాత్రమే జరిగిందని, వాటిని తప్పుగా చూపిస్తూ గొడవ జరిగిందంటూ ప్రచారం చేశారని అన్నారు. అవన్నీ పూర్తిగా అసత్యమని స్పష్టం చేశారు.

**మేమంతా ఒక కుటుంబం**

శేఖర్ మాస్టర్, భాను మాస్టర్‌తో పాటు అసోసియేషన్‌లోని ప్రతి ఒక్కరూ తనకు ఆత్మీయులేనని జానీ మాస్టర్ చెప్పారు. ఒకే కుటుంబంలో అన్నదమ్ములు ఎలా భిన్నంగా మాట్లాడతారో అలాంటి చిన్నచిన్న అభిప్రాయ భేదాలు సహజమేనని పేర్కొన్నారు. ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా అందరం కలిసి అండగా ఉంటామని చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చిన ప్రచారం చూసిన చిరంజీవి షూటింగ్ సమయంలో తమతో మాట్లాడారని వెల్లడించారు. ఆ తర్వాత తాము కలిసి భోజనం కూడా చేశామని, ఎలాంటి వివాదం లేదని మరోసారి స్పష్టం చేశారు.

**డ్యాన్సర్ల కోసం రూ.18 లక్షల విరాళం**

డ్యాన్సర్ల ఆరోగ్య బీమా కోసం జానీ మాస్టర్ చేసిన సహాయం అందరి ప్రశంసలు అందుకుంది. రామ్ చరణ్ ఇప్పటికే రూ.40 లక్షలు అందించారని చెప్పారు. మొత్తం డ్యాన్సర్లకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలంటే రూ.58 లక్షలు అవసరమని వివరించారు. మిగిలిన రూ.18 లక్షల కోసం పలువురిని సంప్రదించినా స్పందన రాలేదని తెలిపారు. ఇటీవల 'పెద్ది' సినిమా నుంచి తనకు వచ్చిన పారితోషికంలో ఒక్క రూపాయి కూడా ఉంచుకోకుండా మొత్తం రూ.18 లక్షలను డ్యాన్సర్ల హెల్త్ ఇన్సూరెన్స్‌కు విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు.

**ఉప ఎన్నికలకు రహస్య ఓటింగ్**

రాజీనామా చేసిన పదవులకు ఉప ఎన్నికలు నిర్వహించాలా లేదా అనే అంశంపైనే రహస్య బ్యాలెట్ నిర్వహించామని సుమలత వెల్లడించారు. అయితే దాన్ని మొత్తం అసోసియేషన్ ఎన్నికలుగా కొందరు తప్పుగా ప్రచారం చేశారని అన్నారు. 188 మంది సభ్యులు పాల్గొన్న సర్వసభ్య సమావేశంలో 136 మందికి పైగా ఉప ఎన్నికలకు మద్దతు ఇచ్చారని తెలిపారు. ఫెడరేషన్ సహకారంతోనే ముందుకు సాగుతామని, అసోసియేషన్ ప్రయోజనాలే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. గతంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై ప్రశ్నించినప్పటి నుంచే తమపై వ్యతిరేక ప్రచారం మొదలైందని ఆరోపించారు.

**మెజార్టీ నిర్ణయంతోనే ముందుకు**

టీఎఫ్‌టీఎడీడీఏ అధ్యక్షురాలు సుమలత కూడా వివాదాలపై స్పందించారు. అసోసియేషన్‌లో తీసుకున్న ప్రతి నిర్ణయం సర్వసభ్య సమావేశంలో వచ్చిన మెజార్టీ అభిప్రాయం ఆధారంగానే జరిగిందని చెప్పారు. ఎక్కడా ఏకపక్ష నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. ఫెడరేషన్‌కు వ్యతిరేకంగా వ్యవహరించే ఉద్దేశం తమకు లేదని పేర్కొన్నారు. చట్టబద్ధంగానే అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

# అమీన్‌పూర్‌లో అక్రమ కట్టడాల రాజ్యం

## అధికారుల మౌనం.. అక్రమార్కులకు దాసోహం
## అక్రమ నిర్మాణాలు.. ప్రజల భద్రతపై ప్రశ్నలు

**అమీన్‌పూర్‌లో అక్రమ నిర్మాణాలు ఇప్పుడు బహిరంగ సవాలుగా మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చట్టాలు ఒకవైపు ఉంటే, అక్రమ కట్టడాలు మరోవైపు యథేచ్ఛగా పెరుగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు ఒక విధంగా తీసుకుని, నిర్మాణాలు మరో విధంగా చేపడుతున్నా సంబంధిత అధికారులు మౌనం పాటిస్తున్నారనే ఆరోపణలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఫిర్యాదులు చేసినా స్పందన లేదనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రజల భద్రతను పక్కనపెట్టి నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. సూర్య రెసిడెన్సీ వ్యవహారం ఇప్పుడు ఈ ఆరోపణలకు కేంద్రబిందువుగా మారింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలకు అడ్డుకట్ట పడకపోతే రేపటి ప్రమాదాలకు బాధ్యత ఎవరిదన్న ప్రశ్న ఇప్పుడు గట్టిగా వినిపిస్తోంది.**

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పరిధిలోని కృష్ణారెడ్డి పేట గ్రామ పంచాయతీలో అక్రమ నిర్మాణాలపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు అక్రమాలకు అడ్డుకట్ట వేయకుండా మౌనం పాటిస్తున్నారనే అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. ఫిర్యాదులు చేసినా స్పందన కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### సూర్య రెసిడెన్సీపై ప్రధాన ఆరోపణలు


కృష్ణారెడ్డిపేటలో నిర్మిస్తున్న సూర్య రెసిడెన్సీ చుట్టూ ఇప్పుడు వివాదం నెలకొంది. జీ ప్లస్ త్రీ నిర్మాణానికి అనుమతి తీసుకుని, అనుమతికి భిన్నంగా నిర్మాణాలు చేపట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. భవన నిర్మాణంలో నిబంధనలను పూర్తిగా పక్కన పెట్టారని చెబుతున్నారు. సొంత స్థలానికి మించి ఇతరుల భూమిని కూడా ఆక్రమించి నిర్మాణం సాగించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరపాలనే డిమాండ్ పెరుగుతోంది.

### భద్రతా ప్రమాణాలకు తూట్లు

భవన నిర్మాణంలో పార్కింగ్ కోసం కేటాయించిన ప్రదేశంలో గదులు నిర్మించారని ఆరోపణలు ఉన్నాయి. సెట్‌బ్యాక్ నిబంధనలను పాటించలేదని స్థానికులు చెబుతున్నారు. అగ్నిప్రమాదం వంటి అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక వాహనం భవనం చుట్టూ తిరిగే అవకాశం కూడా లేకుండా నిర్మాణం జరిగిందని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అక్కడ నివసించే కుటుంబాల భద్రత ప్రశ్నార్థకంగా మారిందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

### లంచాల ఆరోపణలు కలకలం

సదరు నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి పూర్తి అండగా నిలిచారనే ప్రచారం జరుగుతోంది. "నిర్మాణం కొనసాగించండి... ఫిర్యాదులు వస్తే నేను చూసుకుంటా" అని భరోసా ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం సుమారు ఐదు లక్షల రూపాయలు లంచంగా తీసుకున్నారనే చర్చ స్థానికంగా సాగుతోంది. ఈ ఆరోపణలపై అధికారికంగా స్పందన రాకపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.




### ఫిర్యాదులకు స్పందన ఎక్కడ?

జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పలుమార్లు ఫిర్యాదులు అందించినా ఎలాంటి చర్యలు కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఫిర్యాదులు కేవలం దాఖలుకే పరిమితమవుతున్నాయే తప్ప, క్షేత్రస్థాయిలో విచారణ జరగడం లేదని విమర్శిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



### హైడ్రా అమలు ఎందుకు లేదు?

రాష్ట్ర ప్రభుత్వం అక్రమ నిర్మాణాలపై హైడ్రా ద్వారా కఠిన చర్యలు తీసుకుంటున్నామని ప్రకటిస్తోంది. అలాంటి పరిస్థితుల్లో కృష్ణారెడ్డిపేటలోని ఈ నిర్మాణంపై హైడ్రా చర్యలు ఎందుకు లేవనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇతర ప్రాంతాల్లో కూల్చివేతలు జరుగుతుంటే, ఇక్కడ మాత్రం నిబంధనలు ఎందుకు అమలు కావడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



### ప్రభుత్వం జోక్యం చేసుకోవాలనే డిమాండ్

ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణం దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. సంగారెడ్డి జిల్లా అధికారుల పనితీరుపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు వచ్చిన ఆరోపణలపై బిల్డర్ వెంకన్న మురళితో పాటు సంబంధిత అధికారుల పాత్రను కూడా విచారించాలని కోరుతున్నారు. కట్టేవారు కట్టేస్తూ ఉండటం, చూసేవారు చూస్తూ ఉండటం కొనసాగితే రేపు ప్రమాదం జరిగినప్పుడు మూల్యం చెల్లించేది సామాన్య ప్రజలేనని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# షాబాద్ నరహంతకుడి అంతం

## విషం తాగి రాజ్‌కుమార్ ఆత్మహత్య
## ఆరు హత్యల నిందితుడి మృతి
## పెంజర్లలో మృతదేహం కలకలం

తెలుగు రాష్ట్రాలను దిగ్భ్రాంతికి గురిచేసిన షాబాద్ ఆరు హత్యల కేసు ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్ల సమీపంలోని ఓ వెంచర్‌లో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే డయల్--100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం పక్కనే విషం సీసా, మొబైల్ ఫోన్ లభ్యమయ్యాయి. ప్రాథమిక ఆధారాల ప్రకారం రాజ్‌కుమార్ విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.



### రాష్ట్రాన్ని కుదిపేసిన నరమేధం

పోక్సో కేసుపై కక్ష పెంచుకున్న రాజ్‌కుమార్ గత శుక్రవారం అర్ధరాత్రి దారుణ హత్యలకు పాల్పడ్డాడు. ముందుగా బాలిక తల్లి, నానమ్మను కత్తితో హత్య చేశాడు. తర్వాత బాలికను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి గొంతుకోసి చంపాడు. అనంతరం ఇంటికి వెళ్లి భార్యతో పాటు నిద్రిస్తున్న ఇద్దరు చిన్నారులను కూడా అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. కేవలం అరగంట వ్యవధిలో మూడు ప్రాంతాల్లో ఆరుగురిని హతమార్చి పరారయ్యాడు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.

### 14 బృందాలతో గాలింపు

నిందితుడి కోసం పోలీసులు 14 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృత గాలింపు చేపట్టారు. హైదరాబాద్--బెంగళూరు జాతీయ రహదారిపై హోటళ్లు, లాడ్జీలు, దాబాలు తనిఖీ చేశారు. బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్ల సీసీటీవీ దృశ్యాలను పరిశీలించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులను ప్రశ్నించారు. ఈ క్రమంలో పెంజర్లలో అతడి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

### సెల్ఫీ వీడియోలో సంచలన వ్యాఖ్యలు


మృతికి ముందు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో రికార్డు చేసినట్లు ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్ తరుణ్ జోషి వెల్లడించారు. ఘటనాస్థలిలో లభించిన మొబైల్ ఫోన్‌లో ఈ వీడియోను గుర్తించినట్లు చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా అప్పుల్లో కూరుకుపోయానని, జీవితంపై విరక్తి వచ్చిందని వీడియోలో పేర్కొన్నట్లు తెలిపారు. ఒక యువతిని నమ్మి మోసపోయానని కూడా చెప్పినట్లు వెల్లడించారు. అతడు 16 సిమ్ కార్డులు వినియోగించినట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు.

### బెయిల్ తర్వాత మారిన పరిస్థితులు

జూన్ 12న నమోదైన పోక్సో కేసులో రాజ్‌కుమార్‌కు ముందస్తు బెయిల్ లభించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. తనపై నమోదు చేసిన కేసు తప్పుడు కేసు అని, డబ్బుల వివాదం కారణంగానే తనను ఇరికించారని కోర్టులో వాదించినట్లు సమాచారం. ఇదే సమయంలో కుటుంబంలో విభేదాలు తీవ్రరూపం దాల్చినట్లు పోలీసులు గుర్తించారు. భార్య విడాకులు కోరడంతో రాజ్‌కుమార్ మరింత ఆగ్రహానికి గురైనట్లు విచారణలో తేలింది. హత్యలకు కొన్ని గంటల ముందు కుమారుడితో బయటకు వెళ్లి సాధారణంగా గడిపిన అతడు, అనంతరం ఉన్మాదంగా మారి ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పుడు అతడి ఆత్మహత్యతో నిందితుడి ప్రాణం ముగిసినా, ఆరు అమాయక ప్రాణాలను బలిగొన్న ఈ ఘటన మాత్రం రాష్ట్ర చరిత్రలో అత్యంత విషాదకర నేరంగా మిగిలిపోయింది.

# అప్పులే జీవితాన్ని మింగేశాయా?

## హత్యలకు ముందు సంచలన వీడియో
## ఆరు హత్యల ముందు సెల్ఫీ వీడియో
## సెల్ఫీ వీడియోలో రాజ్‌కుమార్ చివరి మాటలు



షాబాద్‌లో ఆరుగురి హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ హత్యలకు ముందు రికార్డు చేసిన సెల్ఫీ వీడియో దర్యాప్తులో కీలక ఆధారంగా మారింది. అతడి మృతదేహం వద్ద లభించిన మొబైల్ ఫోన్‌లో ఈ వీడియోను గుర్తించినట్లు ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్ తరుణ్ జోషి తెలిపారు. జూలై 10న ఈ వీడియో రికార్డు చేసినట్లు సాంకేతిక ఆధారాలతో నిర్ధారించామని వెల్లడించారు. వీడియోలో తన జీవితంపై విరక్తి వ్యక్తం చేసిన రాజ్‌కుమార్, అప్పులు, వ్యక్తిగత సమస్యల గురించి ప్రస్తావించినట్లు పోలీసులు తెలిపారు.

### అప్పుల పాలయ్యానన్న రాజ్‌కుమార్

వీడియోలో ఒక యువతిని నమ్మి తీవ్రంగా నష్టపోయానని రాజ్‌కుమార్ చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు. తన సంపాదనలో సగం డబ్బు ఇతరుల కోసమే ఖర్చు చేశానని పేర్కొన్నట్లు తెలిపారు. చివరకు భారీ అప్పుల్లో కూరుకుపోయానని, తన పిల్లలకు ఆస్తి కూడా మిగలకుండా చేశానని ఆవేదన వ్యక్తం చేసినట్లు వివరించారు. తనపై కేసు పెట్టి జైలుకు పంపే పరిస్థితి వచ్చిందని కూడా వీడియోలో ప్రస్తావించినట్లు సీపీ తెలిపారు.

### రూ.2 కోట్ల అప్పులు.. 16 సిమ్ కార్డులు

రాజ్‌కుమార్‌కు ఆన్‌లైన్ బెట్టింగ్ అలవాటు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఇందుకోసం అతడు 16 సిమ్ కార్డులు వినియోగించినట్లు పోలీసులు గుర్తించారు. రూ.2 కోట్లకు పైగా అప్పులు పేరుకుపోవడంతో అతడి మానసిక పరిస్థితి దెబ్బతిన్నట్లు అధికారులు భావిస్తున్నారు. పోక్సో కేసు నమోదైన తర్వాత కుటుంబ సమస్యలు కూడా మరింత తీవ్రమయ్యాయని పోలీసులు వెల్లడించారు. ఇటీవలే ముందస్తు బెయిల్ వచ్చినప్పటికీ పరిస్థితులు మారలేదని తెలిపారు.

### అరగంటలో ఆరు హత్యలు

జూలై 11 రాత్రి 11 గంటల నుంచి 12 గంటల మధ్య రాజ్‌కుమార్ ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ముందుగా బాలిక నానమ్మను హత్య చేశాడు. తర్వాత బాలికను దేవరకొండ ప్రాంతానికి తీసుకెళ్లి చంపాడు. అనంతరం ఇంటికి వెళ్లి భార్యతో పాటు ఇద్దరు చిన్నారులను హత్య చేశాడు. ఈ నేరాలకు రూ.2 వేల అద్దె కారును వినియోగించినట్లు పోలీసులు గుర్తించారు.

### తండ్రికి ఫోన్ చేసి చెప్పిన విషయం

హత్యలు చేసిన వెంటనే రాత్రి 11.37 గంటలకు తన తండ్రికి ఫోన్ చేసి ఆరుగురిని చంపేశానని, తాను కూడా ఆత్మహత్య చేసుకుంటానని రాజ్‌కుమార్ చెప్పినట్లు సీపీ తరుణ్ జోషి వెల్లడించారు. అనంతరం రాత్రి ఒంటి గంట సమయంలో అతడి తండ్రి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ప్రత్యేక బృందాలు గాలింపు ప్రారంభించాయి. జీపీఎస్ ఆధారంగా రాజ్‌కుమార్ ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ అతడు అప్పటికే పెంజర్ల సమీపంలో విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అతడు ఎప్పుడు మృతి చెందాడనే విషయంపై క్లూస్ టీం ఇంకా దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ కేసులో లభించిన సెల్ఫీ వీడియో, సాంకేతిక ఆధారాలు, ఫోన్ వివరాలు దర్యాప్తుకు కీలకంగా మారాయి.

# వియత్నాం బోటు విషాదం

## స్వదేశానికి 15 మృతదేహాలు
## దర్యాప్తులో ప్రమాద రహస్యం



వియత్నాంలో జరిగిన ఘోర బోటు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 15 మంది భారతీయ పర్యాటకుల మృతదేహాలు స్వదేశానికి తరలించారు. హోచిమిన్ సిటీ నుంచి వియత్నాం ఎయిర్‌లైన్స్ విమానం ద్వారా మృతదేహాలను ముంబైకి పంపించినట్లు భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. అక్కడి నుంచి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కుటుంబ సభ్యులతో సమన్వయం చేసి స్వగ్రామాలకు తరలించే ఏర్పాట్లు చేపడుతున్నాయి. ఈ విషాదంలో మరణించిన వారిలో 10 మంది తమిళనాడుకు చెందినవారు. ముగ్గురు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు. ఇద్దరు కేరళకు చెందినవారు.

### బాధలో అండగా నిలిచిన వియత్నాం

ఈ క్లిష్ట సమయంలో వియత్నాం ప్రజలు చూపిన మానవత్వానికి భారత రాయబార కార్యాలయం కృతజ్ఞతలు తెలిపింది. సంతాప సందేశాలు పంపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపింది. సహాయక చర్యల్లో పాల్గొన్న స్థానిక అధికారులు, అత్యవసర సిబ్బంది, వైద్య బృందాల సేవలను ప్రత్యేకంగా అభినందించింది. తీవ్ర విషాద సమయంలో అందించిన సహకారం బాధిత కుటుంబాలకు ధైర్యాన్ని ఇచ్చిందని పేర్కొంది.

### ఒక్కరు ఇంకా ప్రాణాపాయంలోనే

ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన 16 మంది ఇప్పటికే భారత్‌కు చేరుకున్నారు. అయితే ఒకరు ఇంకా వియత్నాంలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు అత్యవసర వైద్య చికిత్స విజయవంతంగా పూర్తయినట్లు భారత రాయబార కార్యాలయం తెలిపింది. ప్రస్తుతం హోచిమిన్ సిటీలోని ఆసుపత్రిలో వైద్యం కొనసాగుతోంది. కుటుంబ సభ్యులు కూడా అక్కడికి చేరుకున్నారు. ఊపిరితిత్తులకు తీవ్ర నష్టం, మెదడులో రక్తస్రావం, పలు గాయాలతో ఆయన పరిస్థితి ఇంకా విషమంగానే ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

### ప్రమాదం ఎలా జరిగింది?

వియత్నాంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఫూ క్వాక్ ద్వీపం సమీపంలో హాన్ మే రట్ న్గోయ్ ప్రాంతం వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మొత్తం 32 మంది భారతీయ పర్యాటకులు, నలుగురు స్థానిక సిబ్బందితో బయలుదేరిన స్పీడ్‌బోటు ద్వీప సందర్శన ముగించుకుని తిరిగి వస్తుండగా ఒడ్డుకు సుమారు 400 మీటర్ల దూరంలో ఒక్కసారిగా బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 15 మంది అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన వారిని సహాయక బృందాలు రక్షించాయి.

### దర్యాప్తు వేగవంతం

ప్రమాదానికి అసలు కారణం ఇంకా స్పష్టంగా తెలియలేదు. వాతావరణ పరిస్థితులా, సిబ్బంది నిర్లక్ష్యమా, సాంకేతిక లోపమా అనే కోణాల్లో వియత్నాం అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బోటు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. దర్యాప్తు నివేదిక వచ్చిన తర్వాతే ప్రమాదానికి దారితీసిన అసలు కారణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.


# విమాన ఛార్జీల దోపిడీకి చెక్

## టికెట్ ధరలపై నిబంధనలు
## రెండు వారాల్లో సమర్పించాలి
## కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీంకోర్టు

విమాన టికెట్ ధరల్లో భారీ హెచ్చుతగ్గులు, ప్రయాణికులపై పడుతున్న అదనపు భారం విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పౌర విమానయాన రంగంలో అనియంత్రిత ధరలు, అధిక ఛార్జీలను నియంత్రించేందుకు రూపొందించిన కొత్త నిబంధనలను రెండు వారాల్లో కోర్టు ముందు ఉంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. భారతీయ వాయుయాన అధినియమం--2024 కింద రూపొందించిన ఈ నిబంధనలు ప్రస్తుతం సిద్ధంగా ఉన్నాయని కేంద్రం తెలిపింది. హిందీతో పాటు ఇతర అధికార భాషల్లో అనువాదం జరుగుతోందని వెల్లడించింది.

### పార్లమెంట్‌కు ముందే కోర్టుకు

డీజీసీఏ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ అనిల్ కౌశిక్, రాబోయే వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఈ నిబంధనలను ప్రవేశపెడతామని కోర్టుకు తెలిపారు. అయితే పిటిషనర్ తరఫు న్యాయవాది రవీంద్ర శ్రీవాస్తవ అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్టం ప్రకారం ముందుగా ప్రజల అభిప్రాయాల కోసం నిబంధనలను విడుదల చేయాలని చెప్పారు. ఈ వాదనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకముందే సీల్డ్ కవర్‌లో నిబంధనలను కోర్టుకు సమర్పించాలని కేంద్రాన్ని ఆదేశించింది.




### పండుగల సమయంలో భారీ దోపిడీ

పండుగలు, సెలవులు, అత్యవసర పరిస్థితుల్లో విమాన టికెట్ ధరలు ఒక్కసారిగా 100 నుంచి 300 శాతం వరకు పెరుగుతున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. విమాన ఇంధన వ్యయం మొత్తం ఛార్జీలో గరిష్ఠంగా 10 శాతం మాత్రమే ఉన్నప్పటికీ ప్రయాణికుల నుంచి భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారని వాదించారు. విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ తీసుకున్న ప్రయాణికులకు అనుకూల నిర్ణయాలను కూడా కేంద్రం నిలిపివేసిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

### నియంత్రణ వ్యవస్థపై ఆందోళన

విమాన ఛార్జీలను సమీక్షించే స్వతంత్ర నియంత్రణ సంస్థ ప్రస్తుతం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పరిస్థితిని విమానయాన సంస్థలు తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నాయని ఆరోపించారు. సీటు ఎంపిక పేరుతో అదనపు ఛార్జీలు, రద్దు రుసుములు, ఇతర దాచిన ఛార్జీలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ముఖ్యంగా ముందస్తు ప్రణాళిక లేకుండా ప్రయాణించాల్సి వచ్చే మధ్యతరగతి, పేద ప్రయాణికులపై ఈ భారం తీవ్రంగా పడుతోందని తెలిపారు.

### ఆగస్టు 3న తదుపరి విచారణ

ఇటీవల హార్మూజ్ జలసంధి పరిస్థితులను సాకుగా చూపిస్తూ విమాన సంస్థలు మళ్లీ ఛార్జీలు పెంచే అవకాశం ఉందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ అంశంపై సమగ్రంగా పరిశీలన అవసరమని తెలిపింది. ప్రయాణికుల హక్కుల పరిరక్షణకు బలమైన నియంత్రణ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడింది. కొత్త నిబంధనలను పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. ఈ కేసు విచారణను ఆగస్టు 3కు వాయిదా వేసింది.

## రాయవరంలో వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి జాతర



తూర్పుగోదావరి జిల్లా రాయవరంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి జాతర భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఆదివారం అమ్మవారికి జాగారం నిర్వహించగా, భక్తుల కోలాహలంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. గరగలు, బుట్టబొమ్మల నాట్యాలు, డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పడాల కమలారెడ్డి, మందుల షాపు శ్రీను, కేబుల్ శ్రీనివాస్ రెడ్డి, తాడి ఎంకన్న, హరిగారు అబ్బాయ్, పులగం శ్రీనివాస్ రెడ్డి, భీముడు పాల్గొన్నారు. సోమవారం జరిగిన అమ్మవారి తీర్థానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుని ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాతర కమిటీ సభ్యులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

## చంద్రబాబుకు ఘన స్వాగతం

### అనపర్తి నుంచి బైక్ ర్యాలీ.. ధవళేశ్వరం వైపు జైత్రయాత్ర



కాటన్ బ్యారేజ్ గేట్ల పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన కోసం ధవళేశ్వరం చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఘన స్వాగతం పలికేందుకు అనపర్తి నియోజకవర్గం నుంచి కూటమి శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, యువనేత మనోజ్ ఆధ్వర్యంలో వందలాది బైకులతో అనపర్తి నుంచి వేమగిరి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. "జై చంద్రబాబు", "జై పవన్ కళ్యాణ్", "జైజై మోడీ", "జయహో నల్లమిల్లి" నినాదాలతో కెనాల్ రోడ్డు హోరెత్తింది. దాదాపు వెయ్యి మంది రైతులు, నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా బయలుదేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ, ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్‌లోని 197 గేట్లలో 117 గేట్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటి పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.150 కోట్లు మంజూరు గోదావరి డెల్టా రైతులకు ఎంతో మేలు చేసే నిర్ణయమని అన్నారు.



# కన్నెపల్లి పంపింగ్‌పై ప్రచారం అవాస్తవం

- అన్నారం, సుందిళ్ల భద్రతపై ఎన్డీఎస్ఏ సందేహాలు
- శాశ్వత పరిష్కారానికే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యం
- పూర్తి సామర్థ్యంతో ప్రాజెక్టుల పునరుద్ధరణ లక్ష్యం
- దేవాదుల ప్రాజెక్టుకు రూ.146 కోట్లు కేటాయింపు
- కాళేశ్వరంపై ప్రభుత్వానికి క్లారిటీ ఉందన్న ఉత్తమ్

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాగరాజు, యశస్విని పాల్గొన్నారు. ప్రాజెక్టు పనుల పురోగతి, నీటి ఎత్తిపోతల పరిస్థితిని అధికారులు వివరించారు. రైతులకు సాగునీరు సమయానికి అందేలా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

- 5లో...

## — రాజకీయాలకు దూరం —

# తెలంగాణ అభివృద్ధే లక్ష్యం

### ఎంపీలకు సీఎం రేవంత్ సందేశం

### ప్రజాభవన్‌లో కీలక సమావేశం




తెలంగాణ అభివృద్ధి అంశాలపై ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర ఎంపీల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, అనిల్ కుమార్ యాదవ్, రఘువీర్ రెడ్డి, కడియం కావ్య, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రఘురాం రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటెల రాజేందర్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన ప్రధాన అభివృద్ధి ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వ సహకారం ఎలా పొందాలన్న అంశంపై విస్తృతంగా చర్చ జరిగింది.

- 5లో...




సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో "కరువు వర్సెస్ కాళేశ్వరం.. కన్నెపల్లి నుంచి నీటి తరలింపు సాధ్యమా?" అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ, రైతుల సమస్యలపై ఆయన విస్తృతంగా మాట్లాడారు. ప్రభుత్వ వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

# భాష మార్చుకోవాలి

### కాళేశ్వరం కంటే రాజకీయాలే ముఖ్యమా?

### సీఎం రేవంత్‌పై మండిపడ్డ ఎంపీ ఈటల

- 5లో...

# సింగరేణిపై రాజకీయాలు చాలు

### కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై కిషన్ రెడ్డి ఫైర్

### భరోసా యాత్రలో ఘాటు వ్యాఖ్యలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన సింగరేణి భరోసా యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రస్తుతం సింగరేణి ఎదుర్కొంటున్న పరిస్థితులకు ఈ రెండు పార్టీల పాలనే కారణమ ని ఆరోపించారు. గతంలో డబ్బులు తీసుకుని బొగ్గు గనులు కేటాయించారని విమర్శించారు. అప్పట్లో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ సింగరేణిని దోచుకుంటోందని ఆరోపించారు.

- 5లో...

## బనకచర్ల కేసు సర్కారుకు షాక్



### నోటీసులకు సుప్రీం నిరాకరణ

### పిటిషన్‌లో లోపాలే కారణం!?

- 5లో...

జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరా బాద్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్య, సామాజిక న్యాయం, ఎస్సీల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సీఎం వివరించారు.

- 5లో...



## యంగ్ ఇండియా స్కూళ్లు కులవివక్షకు చెక్ పెడతాయ్

### విద్యతో సమాన అవకాశాలు.. ఎస్సీల అభివృద్ధికి ప్రాధాన్యం

### ఎస్సీ కమిషన్ చైర్మన్‌తో సీఎం భేటీ

## సుప్రీం సాక్షిగా బయటపడ్డ రేవంత్ వైఫల్యం

### బనకచర్లపై పిటిషన్ అంతా తప్పుల తడక

### గురువు చంద్రబాబు కోసమే డ్రామాలు

### షాబాద్ ఘటనపైనా హరీశ్ రావు విమర్శలు



# సామ్ నీల్ ఇకలేరు



### జురాసిక్ పార్క్ హీరో కన్నుమూత.. సినీ ప్రపంచానికి తీరని లోటు

### 78 ఏళ్ల వయసులో తుది శ్వాస.. క్యాన్సర్‌పై గెలిచి.. జీవితానికి వీడ్కోలు

హాలీవుడ్ ప్రముఖ నటుడు, జురాసిక్ పార్క్ చిత్రంలో డాక్టర్ అలన్ గ్రాంట్ పాత్రతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సామ్ నీల్ కన్నుమూశారు. ఆయన వయసు 78 సంవత్సరాలు. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో కుటుంబ సభ్యుల సమక్షంలో సోమవారం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఆయన మరణం ఊహించని విధంగా జరిగిందని తెలిపారు. కొద్ది నెలల క్రితమే రక్త క్యాన్సర్ నుంచి పూర్తిగా కోలుకున్నట్లు ప్రకటించిన సామ్ నీల్ ఆకస్మిక మరణం అభిమానులను తీవ్ర విషాదంలో ముంచింది.

- 5లో...

# అమీన్‌పూర్‌లో అక్రమ కట్టడాల రాజ్యం

### అధికారుల మౌనం.. అక్రమార్కులకు దాసోహం

### అక్రమ నిర్మాణాలు.. ప్రజల భద్రతపై ప్రశ్నలు

అమీన్‌పూర్‌లో అక్రమ నిర్మాణాలు ఇప్పుడు బహిరంగ సవాలుగా మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చట్టాలు ఒకవైపు ఉంటే, అక్రమ కట్టడాలు మరోవైపు యథేచ్ఛగా పెరుగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు ఒక విధంగా తీసుకుని, నిర్మాణాలు మరో విధంగా చేపడుతున్నా సంబంధిత అధికారులు మౌనం పాటిస్తున్నారనే ఆరోపణలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఫిర్యాదులు చేసినా స్పందన లేదనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రజల భద్రతను పక్కనపెట్టి నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

- 3లో...

# ఆ విషయంలో తొందరొద్దు..

### పారదర్శక విచారణ తప్పనిసరి

### పౌరసత్వంపై సుప్రీంకోర్టు ఆదేశం

### 27 మందికి తాత్కాలిక ఊరట



పౌరసత్వాన్ని నిర్ధారించే ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, న్యాయబద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒక వ్యక్తిని విదేశీయుడిగా ప్రకటించడం అత్యంత కీలకమైన రాజ్యాంగపరమైన అంశమని పేర్కొంది. అస్సాంలోని ఫారినర్స్ ట్రిబ్యునళ్లు విదేశీయులుగా ప్రకటించిన 27 మంది వ్యక్తుల కేసును విచారించిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధంగా అర్హత లేని వ్యక్తులు తప్పుడు పత్రాలతో భారత పౌరసత్వం పొందకుండా అడ్డుకోవడం ప్రభుత్వ బాధ్యతేనని అంగీకరించినప్పటికీ, న్యాయబద్ధమైన ప్రక్రియను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదని స్పష్టం చేసింది.

- 6లో...

## పారిపోయే ప్రేమను ఆపగలరా?

### ప్రేమించి పారిపోతే పోక్సోనా?.. అమలుపై న్యాయస్థానం కీలక ప్రశ్నలు

### దుర్వినియోగంపై సుప్రీం కోర్టు వార్నింగ్

యుక్తవయసులో ప్రేమించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయే అబ్బాయి, అమ్మాయిలను ప్రభుత్వం ఎలా ఆపగలదని సుప్రీంకోర్టు కీలక ప్రశ్న లేవనెత్తింది. అలాంటి ప్రతి వ్యవహారాన్ని పోక్సో చట్టం కింద నేరంగా పరిగణించడం ఎంతవరకు సమంజసమని వ్యాఖ్యానించింది. పిల్లలను లైంగిక దాడులు, లైంగిక దోపిడీ నుంచి రక్షించేందుకు రూపొందించిన పోక్సో చట్టాన్ని కుటుంబ గౌరవం పేరుతో కొందరు దుర్వినియోగం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది.

- 6లో...




## రామాలయ విరాళాల కేసు

# సీల్డ్ కవర్‌లో నివేదిక ఇవ్వండి

- 6లో...

### రామజన్మభూమి ట్రస్ట్‌కు నోటీసు


### దోపిడీపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం.. సిట్ ప్రస్తుత విచారణ స్థితిపై నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం విచారణ చేపట్టింది. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌కు కూడా నోటీసులు జారీ చేసింది. కేసు విచారణ కొనసాగుతున్నందున నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పించాలని స్పష్టం చేసింది.

# ట్రంప్ ఫీజు ప్లాన్ కలకలం

### అంత సీన్ లేదన్న ఇరాన్.. హర్మ్యూజ్ జలసంధిపై పోరు

### చమురుకు గేటు ఎవరి చేతిలో?




ప్రపంచ చమురు సరఫరాకు కీలక ద్వారమైన హర్మ్యూజ్ జలసంధి మరోసారి అంతర్జాతీయ రాజకీయాల కేంద్రంగా మారింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ మార్గం భద్రత కోసం ఫీజు వసూలు చేయాలన్న ప్రతిపాదనతో కొత్త చర్చకు తెరలేపగా, ఇరాన్ మాత్రం అలాంటి బెదిరింపులకు తాము వెనక్కి తగ్గబోమని స్పష్టం చేసింది. హర్మ్యూజ్‌పై ఆధిపత్య పోరు కేవలం అమెరికా--ఇరాన్ మధ్య వివాదంగా మాత్రమే కాకుండా, ప్రపంచ చమురు మార్కెట్, ఇంధన ధరలు, దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాల ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేసే అంశంగా మారింది. ఈ నేపథ్యంలో హర్మ్యూజ్ జలసంధి ఎందుకు అంత కీలకం? ట్రంప్ ఫీజు ప్లాన్ వెనుక ఉద్దేశం ఏమిటి? ఇరాన్ ఎందుకు తీవ్రంగా స్పందిస్తోంది? ఇప్పుడు ప్రపంచం దృష్టి మొత్తం ఈ సముద్ర మార్గంపైనే నిలిచింది.

- 6లో...

## అద్భుతాలు.. కాంట్రవర్సీలు

### మోదీకి 35వ అంతర్జాతీయ గౌరవం

### ప్రపంచ వేదికపై మరో మైలురాయి

- 7లో...



# బనకచర్ల కేసు సర్కారుకు షాక్

**నోటీసులకు సుప్రీం నిరాకరణ.. పిటిషన్‌లో లోపాలే కారణం!?**



బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు, పోలవరం, గోదావరి జలాల వినియోగానికి సంబంధించిన తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏపీ ప్రభుత్వానికి వెంటనే నోటీసులు జారీ చేయాలని, ఇంజక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలని తెలంగాణ చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టింది.

**పిటిషన్‌లో లోపాలపై అభ్యంతరం**

తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌లో నిబంధనలకు సంబంధించిన లోపాలు ఉన్నాయని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ లోపాలు సరిచేయకుండా విచారణ కొనసాగించడం సాధ్యం కాదని తెలిపింది. లోపాల సవరణ పూర్తైన తర్వాతే కేసులోని ఇతర అంశాలను పరిశీలిస్తామని న్యాయస్థానం వెల్లడించింది. రిజిస్ట్రీ నిబంధనల ప్రకారం ఒరిజినల్ సూట్ పిటిషన్ ముందుగా చాంబర్ జడ్జి ఎదుట దాఖలు కావాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆ ప్రక్రియ పూర్తికాకముందే కేసు నేరుగా బెంచ్ ముందుకు రావడం సరైన విధానం కాదని వ్యాఖ్యానించింది. ప్రస్తుతం కేసులో మొత్తం 15 మంది ప్రతివాదులు ఉన్నట్లు తెలంగాణ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు.

**నోటీసులపై స్పష్టమైన నిర్ణయం**

పిటిషన్ నిబంధనల ప్రకారం పరిశీలన పూర్తి కాకముందు ప్రతివాదులకు నోటీసులు జారీ చేయడం కుదరదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అందువల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వాలన్న తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను ధర్మాసనం అంగీకరించలేదు. పిటిషన్‌లోని లోపాలు సరిచేసిన తర్వాతే తదుపరి న్యాయ ప్రక్రియ కొనసాగుతుందని కోర్టు వెల్లడించింది. దీంతో బనకచర్ల వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వానికి తాత్కాలికంగా ఎదురుదెబ్బ తగిలినట్లైంది.

# భాష మార్చుకోవాలి

**కాళేశ్వరం కంటే రాజకీయాలే ముఖ్యమా?**

**సీఎం రేవంత్‌పై మండిపడ్డ ఎంపీ ఈటల**



సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో "కరువు వర్సెస్ కాళేశ్వరం.. కన్నెపల్లి నుంచి నీటి తరలింపు సాధ్యమా?" అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ, రైతుల సమస్యలపై ఆయన విస్తృతంగా మాట్లాడారు. ప్రభుత్వ వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

**సీఎం భాష మార్చుకోవాలి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న తీరు ప్రజాస్వామ్యానికి తగినట్లు లేదని ఈటల రాజేందర్ విమర్శించారు. రిటైర్డ్ ఇంజనీర్లపై చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలకు సమాధానం చెప్పాల్సిన నాయకుడు బెదిరింపుల భాష ఉపయోగించడం సరైన పద్ధతి కాదన్నారు. అలాంటి వ్యాఖ్యలు తెలంగాణ సమాజాన్ని బాధిస్తున్నాయని చెప్పారు.

**కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తొచ్చు**

కన్నెపల్లి వద్ద లక్ష క్యూసెక్కుల వరకు నీరు ప్రవహిస్తున్నా ప్రభుత్వం దాన్ని వినియోగించేందుకు ముందుకు రావడం లేదని ఈటల ఆరోపించారు. రైతులు నీటి కోసం ఎదురుచూస్తుంటే ప్రభుత్వం రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎల్లంపల్లి జలాలను విద్యుత్ ఉత్పత్తి, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కేటాయించిన పరిస్థితిని కూడా ప్రస్తావించారు. ప్రస్తుతం గ్రామాల్లో బోర్లు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఎన్డీఎస్‌ఏ నివేదికను ప్రస్తావిస్తూ**

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై ప్రభుత్వం చెబుతున్న వివరాలకు భిన్నంగా నిపుణుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఈటల సూచించారు. 2024లో గ్రౌటింగ్ పనులు చేపట్టిన విషయాన్ని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలోనే ప్రస్తావించారని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో కేంద్రం, ఎన్డీఎస్‌ఏతో సంప్రదించి పరిష్కార మార్గాలు అన్వేషించాల్సిందని అభిప్రాయపడ్డారు. వర్షాలు లేక పత్తి పంటలు ఎండిపోతున్నాయని, రైతులు బిందెలతో నీళ్లు పోస్తున్న దుస్థితి కనిపిస్తోందని ఈటల అన్నారు. ఇలాంటి సమయంలో వెంటనే సాగునీటి చర్యలు చేపట్టాల్సింది పోయి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. కరువును రాజకీయ అంశంగా కాకుండా రైతుల జీవన సమస్యగా చూడాలని ప్రభుత్వానికి సూచించారు.

**ప్రజలే తుది తీర్పు చెబుతారు**

ప్రజల సమస్యలు పరిష్కరించకుండా విమర్శించిన వారిని బెదిరించడం సరైన పాలనా విధానం కాదని ఈటల రాజేందర్ అన్నారు. దేవాదుల ప్రాజెక్టును పరిశీలించినట్లే అన్నారం, సుందిళ్ల ప్రాంతాలను కూడా సందర్శించి వాస్తవ పరిస్థితులు తెలుసుకోవాలని ముఖ్యమంత్రికి సూచించారు. రిటైర్డ్ ఇంజనీర్లకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని మరోసారి డిమాండ్ చేశారు. అధికార అహంకారంతో కాకుండా ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదం తమకు ఉందని, ప్రజల తీర్పే చివరికి నిర్ణయాత్మకమవుతుందని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు.



# రాజకీయాలకు దూరం

# తెలంగాణ అభివృద్ధే లక్ష్యం

**ఎంపీలకు సీఎం రేవంత్ సందేశం**

**ప్రజాభవన్‌లో కీలక సమావేశం**



తెలంగాణ అభివృద్ధి అంశాలపై ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర ఎంపీల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, అనిల్ కుమార్ యాదవ్, రఘువీర్ రెడ్డి, కడియం కావ్య, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రఘురాం రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటెల రాజేందర్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన ప్రధాన అభివృద్ధి ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వ సహకారం ఎలా పొందాలన్న అంశంపై విస్తృతంగా చర్చ జరిగింది.

**రాజకీయాలకు అతీతంగా ముందుకు**

సమావేశంలో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం పరస్పర సహకారంతో పనిచేస్తేనే తెలంగాణ వేగంగా అభివృద్ధి సాధిస్తుందని స్పష్టం చేశారు. రాజకీయ విభేదాలు అభివృద్ధికి అడ్డంకిగా మారకూడదని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో అందరూ ఒకే వేదికపై నిలవాలని ఎంపీలకు పిలుపునిచ్చారు. కేంద్రం సహకరిస్తే దాన్ని బహిరంగంగానే స్వాగతిస్తామని, ఆ సహకారాన్ని అంగీకరించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని పేర్కొన్నారు.

**హైదరాబాద్‌కు ఐఐఎం లక్ష్యం**

హైదరాబాద్‌కు భారతీయ నిర్వహణ సంస్థ (ఐఐఎం) తీసుకురావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ విషయంలో బీజేపీ ఎంపీలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. మెట్రో రైలు విస్తరణకు కేంద్ర ప్రభుత్వ సహకారం అత్యంత అవసరమని వివరించారు. రుణాల ఆమోద ప్రక్రియ వేగవంతం అయితే నగర రవాణా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు.

**ఆర్ఆర్ఆర్, మూసీ ప్రాజెక్టులపై దృష్టి**

రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) భూసేకరణ దాదాపు పూర్తయిందని సీఎం వెల్లడించారు. ఇప్పుడు కేంద్రం నుంచి నిధులు లభిస్తే ప్రాజెక్టు వేగంగా పూర్తవుతుందని చెప్పారు. మూసీ నది పునరుజ్జీవానికి అవసరమైన అర్బన్ ఛాలెంజ్ ఫండ్ అనుమతులు త్వరగా వచ్చేలా ఎంపీలు కృషి చేయాలని సూచించారు. ఈ ప్రాజెక్టులు తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు.

**సాగునీటి ప్రాజెక్టులకు**

**కేంద్రం చొరవ అవసరం**

సాగునీటి అంశంపై కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. తుంగభద్ర గేట్ల ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ఈ విషయాలపై చర్చించినట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీలు, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీల నీటి వినియోగానికి అవసరమైన ఎన్‌వోసీని ఆంధ్రప్రదేశ్ ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఈ అంశం ప్రస్తుతం చర్చల దశలో ఉందని, కేంద్రం చొరవ తీసుకుంటే పరిష్కారం వేగవంతం అవుతుందని అభిప్రాయపడ్డారు.

**పెండింగ్ ప్రాజెక్టులకు**

**గ్రీన్ సిగ్నల్ కోరుతూ**

మొత్తం 120 టీఎంసీలకు కేంద్ర అనుమతులు లభిస్తే సాగునీటి ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గోదావరి--కావేరి నదుల అనుసంధానం రాష్ట్రానికి దీర్ఘకాలిక ప్రయోజనాలు అందిస్తుందని చెప్పారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు, పోర్ట్ కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్ విమానాశ్రయం, వరంగల్ విమానాశ్రయాలకు సంబంధించిన అనుమతులు కూడా త్వరగా పూర్తయ్యేలా ఎంపీలు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం, రాష్ట్రం ఒకే దిశగా అడుగులు వేస్తే తెలంగాణ మరింత వేగంగా ముందుకు సాగుతుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# సుప్రీం సాక్షిగా బయటపడ్డ రేవంత్ వైఫల్యం

**బనకచర్లపై పిటిషన్ అంతా తప్పుల తడక**

**గురువు చంద్రబాబు కోసమే డ్రామాలు**

**షాబాద్ ఘటనపైనా హరీశ్ రావు తీవ్ర విమర్శలు**



బనకచర్ల అంశంపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెట్టాయని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. మొదటి నుంచి బనకచర్ల వ్యవహారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు.

**చంద్రబాబు కోసమే డ్రామా**

సుప్రీంకోర్టు పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని స్పష్టం చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని హరీశ్ రావు అన్నారు. కావాలనే తప్పులతో కేసు దాఖలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ప్రజలను నమ్మించేందుకు బ్యాక్‌డేట్ లేఖలు రాసిందని విమర్శించారు. ఏడు నెలలుగా ప్రభుత్వం చేసిన పని ఏమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ గురువు చంద్రబాబు నాయుడు ప్రయోజనాల కోసమే వ్యవహరిస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. బనకచర్ల సమావేశానికి వెళ్లనని చెప్పి తర్వాత రహస్యంగా హాజరయ్యారని విమర్శించారు. కమిటీలో ఆదిత్యనాథ్ దాస్‌ను నియమించడం కూడా అనుమానాలకు తావిస్తోందని అన్నారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించడం లేదని ఆరోపించారు.

**ఎన్‌వోసీపై అసెంబ్లీలో చర్చ కోరుతూ**

ఎన్‌వోసీ పేరిట తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని హరీశ్ రావు ఆరోపించారు. ఈ అంశంపై వెంటనే అసెంబ్లీ సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. దొంగచాటుగా నిర్ణయాలు తీసుకుంటే బీఆర్ఎస్ మౌనంగా ఉండదని హెచ్చరించారు. దేవాదుల ప్రాజెక్టులో ప్రభుత్వం పూర్తి స్థాయిలో నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టలేదని హరీశ్ రావు విమర్శించారు. 2,500 క్యూసెక్కుల నీటిని ఎత్తాల్సి ఉండగా కేవలం ఆరు మోటర్లు మాత్రమే నడుపుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావడంతోనే ప్రభుత్వం మోటార్లు ప్రారంభించిందని చెప్పారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులను సక్రమంగా వినియోగించడంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు.

**పాదయాత్రతో పోరాటం**

సంగమేశ్వర-బసవేశ్వర ప్రాజెక్టు పనులు నిలిపివేయడం వల్ల మెదక్ జిల్లా రైతులు నష్టపోతున్నారని హరీశ్ రావు అన్నారు. ఈ అంశంపై త్వరలోనే బసవేశ్వర విగ్రహం నుంచి సంగమేశ్వర ప్రాజెక్టు వరకు భారీ పాదయాత్ర చేపడతామని ప్రకటించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు గట్టి తీర్పు ఇస్తారని, మెదక్ జిల్లాలో అన్ని అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు.

**చట్టవ్యవస్థపై ఆరోపణలు**

షాబాద్ ఘటనను ప్రస్తావిస్తూ పోలీసుల పనితీరుపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై వెంటనే చర్యలు తీసుకునే పోలీసులు, నేరస్థుడిని పట్టుకోవడంలో ఎందుకు ఆలస్యం చేశారని ప్రశ్నించారు. పోలీసు స్టేషన్లు అధికార పార్టీ నేతల ప్రభావంలో నడుస్తున్నాయని ఆరోపించారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. సీఎంపైనా తీవ్ర విమర్శలు చేశారు.



## యంగ్ ఇండియా స్కూళ్లు కులవివక్షకు చెక్ పెడతాయ్

**విద్యతో సమాన అవకాశాలు**

**ఎస్సీల అభివృద్ధికి ప్రాధాన్యం**

**ఎస్సీ కమిషన్ చైర్మన్‌తో సీఎం భేటీ**

జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్య, సామాజిక న్యాయం, ఎస్సీల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సీఎం వివరించారు. విద్యార్థుల మధ్య కుల వివక్షకు తావులేకుండా ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే వీటిని అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ద్వారా నాణ్యమైన విద్య అందిస్తామని వెల్లడించారు. విద్యార్థులకు పాఠశాలల్లోనే అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని సీఎం తెలిపారు. రవాణా సౌకర్యం కూడా కల్పిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల సంఖ్యను పెంచుతున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఎస్సీలకు జనాభా శాతానికి మించి అవకాశాలు కల్పిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. రాజకీయాలు, ఇతర రంగాల్లో వారికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ అమలు జరుగుతోందని వెల్లడించారు. ఎస్సీల అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని కిషోర్ మక్వానాను సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

## సింగరేణిపై రాజకీయాలు చాలు

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై కిషన్ రెడ్డి ఫైర్**

**భరోసా యాత్రలో ఘాటు వ్యాఖ్యలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన సింగరేణి భరోసా యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రస్తుతం సింగరేణి ఎదుర్కొంటున్న పరిస్థితులకు ఈ రెండు పార్టీల పాలనే కారణమని ఆరోపించారు. గతంలో డబ్బులు తీసుకుని బొగ్గు గనులు కేటాయించారని విమర్శించారు. అప్పట్లో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ సింగరేణిని దోచుకుంటోందని ఆరోపించారు.

**ఓటు బ్యాంకుగా సింగరేణి**

కాంగ్రెస్ హయాంలో జరిగిన బొగ్గు గనుల కేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. అనంతరం బొగ్గు బ్లాకుల కేటాయింపులు పారదర్శకంగా జరగాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం మాత్రం వేలం ప్రక్రియ లేకుండానే తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిందని తెలిపారు. ఈ బ్లాక్‌లో ఉన్న నాణ్యమైన బొగ్గు నిల్వలు సంస్థకు మరో 40 నుంచి 50 సంవత్సరాల వరకు ఉపయోగపడతాయని వివరించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాటు సింగరేణిని ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకున్నారని కిషన్ రెడ్డి విమర్శించారు. సింగరేణికి చేసిన మేలు ఏమిటో ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ గురించి బీఆర్ఎస్ ఎప్పుడూ మాట్లాడలేదని అన్నారు. సింగరేణిలో ఏ సమస్య వచ్చినా కేంద్రాన్ని సంప్రదించకుండా రాజకీయ ఆరోపణలకే పరిమితమయ్యారని విమర్శించారు.

**రూ.24 వేల కోట్ల బకాయిలు**

సింగరేణి నుంచి తీసుకున్న బొగ్గు, విద్యుత్ బిల్లులకు సంబంధించిన సుమారు రూ.24 వేల కోట్ల బకాయిలను బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించకుండా వదిలేసిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రానికి సంస్థలో 49 శాతం వాటా ఉన్నా అభివృద్ధి కోసం సమర్థంగా ప్రయత్నించలేదన్నారు. కార్మికుల కష్టాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారని మండిపడ్డారు. సింగరేణి సంస్థకు మరిన్ని బొగ్గు బ్లాకులు అవసరమని తాను పలుమార్లు ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లినట్లు కిషన్ రెడ్డి తెలిపారు.

# కన్నెపల్లి పంపింగ్‌పై ప్రచారం అవాస్తవం

**అన్నారం, సుందిళ్ల భద్రతపై ఎన్డీఎస్‌ఏ సందేహాలు**

**శాశ్వత పరిష్కారానికే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యం**

**పూర్తి సామర్థ్యంతో ప్రాజెక్టుల పునరుద్ధరణ లక్ష్యం**

**దేవాదుల ప్రాజెక్టుకు రూ.146 కోట్లు కేటాయింపు**

**కాళేశ్వరంపై ప్రభుత్వానికి క్లారిటీ ఉందన్న ఉత్తమ్**

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాగరాజు, యశస్విని పాల్గొన్నారు. ప్రాజెక్టు పనుల పురోగతి, నీటి ఎత్తిపోతల పరిస్థితిని అధికారులు వివరించారు. రైతులకు సాగునీరు సమయానికి అందేలా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

**24 గంటలు పంపులు నడపాలని ఆదేశం**

గోదావరి నది నుంచి సాధ్యమైనంత ఎక్కువ నీటిని ఎత్తిపోసేలా దేవాదుల ప్రాజెక్టులోని అన్ని పంపులను ఇరవై నాలుగు గంటలు నిరంతరం నడపాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియతో పాటు కొనసాగుతున్న నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా వెంటనే పూర్తి చేయాలని చెప్పారు.

**రూ.146 కోట్ల విడుదల**

దేవాదుల ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం రూ.146 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో కొనసాగుతున్న నిర్మాణ పనులు, భూసేకరణ ప్రక్రియ వేగంగా పూర్తవుతాయని మంత్రి తెలిపారు. రైతులకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తోందని చెప్పారు. ప్రాజెక్టు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని వెల్లడించారు.



**కాళేశ్వరంపై కీలక ప్రకటన**

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచించిన పరీక్షల ప్రక్రియ దాదాపు పూర్తయిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మూడు బ్యారేజీల మరమ్మతులు, పునరుద్ధరణ పనుల కోసం ఐఐటీ బాంబే సాంకేతిక సహకారంతో రీడిజైన్ చేస్తున్నామని చెప్పారు. వచ్చే వేసవి నాటికి పనులు పూర్తిచేసి ఆ తర్వాత నీటిని నిల్వ చేసి బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు.

**ప్రతిపక్షాల ఆరోపణలపై స్పందన**

కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసే ప్రక్రియ నిలిచిపోయిందని ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ఫౌండేషన్ పరిస్థితిపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ లిఖితపూర్వకంగా సందేహాలు వ్యక్తం చేసిందని గుర్తుచేశారు. అందుకే శాశ్వత పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. భద్రతకు ప్రాధాన్యం ఇస్తూనే ప్రాజెక్టులను తిరిగి పూర్తి సామర్థ్యంతో అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# సామ్ నీల్ ఇకలేరు

**జురాసిక్ పార్క్ హీరో కన్నుమూత.. సినీ ప్రపంచానికి తీరని లోటు**

**78 ఏళ్ల వయసులో తుది శ్వాస.. క్యాన్సర్‌పై గెలిచి.. జీవితానికి వీడ్కోలు**



హాలీవుడ్ ప్రముఖ నటుడు, జురాసిక్ పార్క్ చిత్రంలో డాక్టర్ అలన్ గ్రాంట్ పాత్రతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సామ్ నీల్ కన్నుమూశారు. ఆయన వయసు 78 సంవత్సరాలు. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో కుటుంబ సభ్యుల సమక్షంలో సోమవారం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఆయన మరణం ఊహించని విధంగా జరిగిందని తెలిపారు. కొద్ది నెలల క్రితమే రక్త క్యాన్సర్ నుంచి పూర్తిగా కోలుకున్నట్లు ప్రకటించిన సామ్ నీల్ ఆకస్మిక మరణం అభిమానులను తీవ్ర విషాదంలో ముంచింది.

### జురాసిక్ పార్క్‌తో చిరస్థాయిగా

స్టేజ్–3 రక్త క్యాన్సర్‌తో కొన్నేళ్లుగా పోరాడిన సామ్ నీల్ ఆధునిక కార్--టి సెల్ చికిత్సతో పూర్తిగా కోలుకున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో తాను క్యాన్సర్ రహితుడినని స్వయంగా ప్రకటించారు. మళ్లీ సినిమాల్లో నటించాలనే ఆశాభావాన్ని కూడా వ్యక్తం చేశారు. అయితే ఆరోగ్యం మెరుగుపడిన కొద్ది నెలల్లోనే ఆయన మరణించడం సినీ పరిశ్రమను దిగ్భ్రాంతికి గురిచేసింది. 1947లో ఉత్తర ఐర్లాండ్‌లో జన్మించిన సామ్ నీల్ చిన్న వయసులోనే న్యూజిలాండ్‌కు వెళ్లారు. అక్కడి నుంచి సినీ ప్రయాణాన్ని ప్రారంభించి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సంపాదించారు. స్లీపింగ్ డాగ్స్, మై బ్రిలియంట్ కెరీర్, ది హంట్ ఫర్ రెడ్ అక్టోబర్, ది పియానో వంటి చిత్రాలతో నటుడిగా తన ప్రతిభను చాటుకున్నారు. 1993లో విడుదలైన జురాసిక్ పార్క్ సినిమాలో డాక్టర్ అలన్ గ్రాంట్ పాత్ర ఆయనకు ప్రపంచవ్యాప్త ఖ్యాతిని తీసుకొచ్చింది. తర్వాత జురాసిక్ పార్క్--3, జురాసిక్ వరల్డ్ డొమినియన్ చిత్రాల్లో కూడా అదే పాత్రలో నటించి ప్రేక్షకులను అలరించారు.

### ఐదు దశాబ్దాల అద్భుత ప్రస్థానం

సుమారు ఐదు దశాబ్దాల సినీ జీవితంలో 150కు పైగా సినిమాలు, టెలివిజన్ ప్రాజెక్టుల్లో సామ్ నీల్ నటించారు. డెడ్ కామ్, ఈవెంట్ హొరైజన్, ది ట్యూడర్స్, పీకీ బ్లైండర్స్ వంటి అనేక ప్రముఖ చిత్రాలు, సిరీస్‌లలో ఆయన తనదైన ముద్ర వేశారు. డ్రామా, థ్రిల్లర్, హారర్, కమర్షియల్ చిత్రాలు అనే తేడా లేకుండా ప్రతి పాత్రను సహజంగా పోషించి ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించారు. నటనతో పాటు న్యూజిలాండ్‌లోని తన ద్రాక్ష తోట నిర్వహణలో కూడా సామ్ నీల్ ఆసక్తి చూపేవారు. సామాజిక మాధ్యమాల్లో వ్యవసాయ జీవితం, జంతువులతో గడిపిన క్షణాలను పంచుకుంటూ అభిమానులకు మరింత చేరువయ్యారు. 2022లో నటనకు చేసిన విశేష సేవలకు గాను నైట్‌హుడ్ గౌరవం అందుకున్నారు. ఆయన మరణంపై ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. తన పిల్లలు, మనవళ్లను విడిచి వెళ్లిన సామ్ నీల్ సృష్టించిన పాత్రలు మాత్రం సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనున్నాయి.

# పారిపోయే ప్రేమను ఆపగలరా?

**ప్రేమించి పారిపోతే పోక్సోనా?**

**అమలుపై న్యాయస్థానం కీలక ప్రశ్నలు**

**దుర్వినియోగంపై సుప్రీం కోర్టు వార్నింగ్**



యుక్తవయసులో ప్రేమించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయే అబ్బాయి, అమ్మాయిలను ప్రభుత్వం ఎలా ఆపగలదని సుప్రీంకోర్టు కీలక ప్రశ్న లేవనెత్తింది. అలాంటి ప్రతి వ్యవహారాన్ని పోక్సో చట్టం కింద నేరంగా పరిగణించడం ఎంతవరకు సమంజసమని వ్యాఖ్యానించింది. పిల్లలను లైంగిక దాడులు, లైంగిక దోపిడీ నుంచి రక్షించేందుకు రూపొందించిన పోక్సో చట్టాన్ని కుటుంబ గౌరవం పేరుతో కొందరు దుర్వినియోగం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

### 15 నుంచి 18 ఏళ్లు సున్నితమైన దశ

15 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు అత్యంత సున్నితమైన దశ అని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ వయసులో యువతలో భావోద్వేగాలు, ఆకర్షణలు, సంబంధాలపై ఆసక్తి సహజంగా ఉంటుందని అభిప్రాయపడింది. అలాంటి పరిస్థితుల్లో పరస్పర అంగీకారంతో ఏర్పడిన ప్రతి సంబంధాన్ని పోక్సో కేసుగా చూడటం సరైన విధానం కాదని సూచించింది. తల్లిదండ్రులు కుటుంబ పరువు పేరుతో క్రిమినల్ కేసులు నమోదు చేయించడం పెరుగుతోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. యుక్తవయసు పిల్లల గోప్యత హక్కులకు సంబంధించిన సుమోటో కేసు విచారణ సందర్భంగా ఈ అంశం చర్చకు వచ్చింది. గతంలో కలకత్తా హైకోర్టు ఇచ్చిన వివాదాస్పద తీర్పు తర్వాత సుప్రీంకోర్టు ఈ కేసును స్వయంగా విచారణకు తీసుకుంది. హైకోర్టు చేసిన వ్యాఖ్యలను ఇప్పటికే రద్దు చేసింది. విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ అసలు కేసు వివరాలను కోర్టుకు వివరించారు. మైనర్ బాలిక 25 ఏళ్ల వ్యక్తితో కలిసి వెళ్లి అతడితో జీవితం కొనసాగించిందని, వారికి బిడ్డ కూడా జన్మించిందని తెలిపారు. ప్రస్తుతం ఆ కుటుంబం ప్రశాంతంగా జీవిస్తోందని చెప్పారు.

### పోక్సో కేసుల్లో వ్యవస్థ వైఫల్యం

ఈ కేసు సందర్భంగా నియమించిన కమిటీ సమర్పించిన నివేదికలో పోక్సో అమలులో అనేక లోపాలు బయటపడ్డాయని మాధవి దివాన్ వెల్లడించారు. చట్టం కింద బాధితులకు పునరావాసం కల్పించే నిబంధనలు ఉన్నప్పటికీ అమలులో లోపాలు ఉన్నాయని వివరించారు. 17, 18 ఏళ్ల యువకులు పరస్పర అంగీకారంతో ఉన్న సంబంధాల కారణంగా జైలుకు వెళ్లే పరిస్థితులు ఎదురవుతున్నాయని చెప్పారు. దీనిపై చిన్న వయసు నుంచే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం కూడా పలు సూచనలు సమర్పించింది. ఆరో తరగతి నుంచే దశలవారీగా పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలని ప్రతిపాదించింది. యుక్తవయసు విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. పోక్సో కేసుల పర్యవేక్షణకు ప్రత్యేక డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేయాలని కూడా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే ఈ బాధ్యతను కేంద్రం కాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు, హైకోర్టులే సమర్థంగా నిర్వహించగలవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

### జూలై 17న తదుపరి విచారణ

2012లో సమ్మతి వయసును 16 నుంచి 18 సంవత్సరాలకు పెంచిన తర్వాత మాత్రమే ఇలాంటి సమస్యలు ప్రారంభం కాలేదని ధర్మాసనం పేర్కొంది. గతంలో కూడా బాల్య వివాహాలు, యుక్తవయసు సంబంధాలు ఉండేవని గుర్తు చేసింది. చట్టం అమలు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉండాలని సూచించింది. పిల్లల రక్షణతో పాటు యుక్తవయసు పిల్లల హక్కులు, సామాజిక వాస్తవాలను కూడా సమతుల్యంగా పరిగణించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈ కేసు తదుపరి విచారణను జూలై 17కు వాయిదా వేసింది.

### చట్టం రక్షణకే.. దుర్వినియోగానికి కాదు

పిల్లలను లైంగిక దాడులు, దోపిడీ నుంచి కాపాడటమే పోక్సో చట్టం అసలు లక్ష్యం. పరస్పర అంగీకారంతో ఉన్న యుక్తవయసు సంబంధాలను ప్రతి సందర్భంలోనూ నేరంగా చూడడం చట్టం ఉద్దేశాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో మైనర్ల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని కూడా స్పష్టం చేస్తున్నారు. కుటుంబ గౌరవం పేరుతో తప్పుడు కేసులు నమోదు చేయడం చట్ట దుర్వినియోగంగా మారే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం యుక్తవయసు పిల్లలకు సరైన అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు. పోక్సో చట్టాన్ని రక్షణ కవచంగా ఉపయోగించాలి తప్ప, వ్యక్తిగత విభేదాలు తీర్చుకునే ఆయుధంగా మార్చకూడదనే సందేశం సుప్రీంకోర్టు వ్యాఖ్యల ద్వారా స్పష్టంగా వినిపించింది.

# ఆ విషయంలో తొందరొద్దు

**పారదర్శక విచారణ తప్పనిసరి**

**పౌరసత్వంపై సుప్రీంకోర్టు ఆదేశం**

**27 మందికి తాత్కాలిక ఊరట**

పౌరసత్వాన్ని నిర్ధారించే ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, న్యాయబద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒక వ్యక్తిని విదేశీయుడిగా ప్రకటించడం అత్యంత కీలకమైన రాజ్యాంగపరమైన అంశమని పేర్కొంది. అస్సాంలోని ఫారినర్స్ ట్రిబ్యునళ్లు విదేశీయులుగా ప్రకటించిన 27 మంది వ్యక్తుల కేసును విచారించిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధంగా అర్హత లేని వ్యక్తులు తప్పుడు పత్రాలతో భారత పౌరసత్వం పొందకుండా అడ్డుకోవడం ప్రభుత్వ బాధ్యతేనని అంగీకరించినప్పటికీ, న్యాయబద్ధమైన ప్రక్రియను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదని స్పష్టం చేసింది.

### 27 మందిపై బలవంతపు చర్యలకు బ్రేక్

ఈ కేసులో గౌహతి హైకోర్టు, ఫారినర్స్ ట్రిబ్యునళ్లు ఇచ్చిన గత తీర్పులను సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. కేసును మరోసారి ట్రిబ్యునళ్లు సమగ్రంగా విచారించాలని ఆదేశించింది. అప్పటి వరకు ఆ 27 మంది వ్యక్తులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, పిటిషనర్ల పౌరసత్వంపై తుది నిర్ణయం తీసుకోలేదని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది.

### స్పెల్లింగ్ తప్పిదాలతో విదేశీయులా?

పిటిషనర్లు తమ పేర్ల స్పెల్లింగ్‌లో చిన్నచిన్న పొరపాట్లు, పాత ఓటరు జాబితాల్లో ఉన్న సాంకేతిక తేడాల కారణంగానే తమను విదేశీయులుగా ప్రకటించారని కోర్టుకు వివరించారు. తాము భారతీయ పౌరులేనని నిరూపించేందుకు 1971కు ముందున్న లెగసీ డేటా, పాత ఓటరు జాబితాలు, భూమి రికార్డులు సమర్పించారు. ఇలాంటి సాంకేతిక లోపాలను ఆధారంగా చేసుకుని ఒకరి పౌరసత్వాన్ని నిరాకరించడం తీవ్రమైన పరిణామాలకు దారితీస్తుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



**దేశవ్యాప్తంగా చట్టపరమైన చర్చ**

ఇదే తరహా కేసులో గత జూన్‌లో కూడా ఐదుగురు మహిళలను విదేశీయులుగా బహిష్కరించకుండా సుప్రీంకోర్టు నిలువరించింది. అవసరమైన పత్రాలు ఉన్నప్పటికీ పేర్లలో స్వల్ప తేడాల ఆధారంగా విదేశీయులుగా ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజా తీర్పుతో అస్సాంలోని ఫారినర్స్ ట్రిబ్యునళ్లు అనుసరిస్తున్న ప్రమాణాలపై మరోసారి చర్చ మొదలైంది. పౌరసత్వం వంటి అత్యంత కీలకమైన హక్కును నిర్ణయించే ప్రక్రియలో ప్రతి ఆధారాన్ని నిష్పక్షపాతంగా పరిశీలించడం తప్పనిసరని సుప్రీంకోర్టు స్పష్టం చేయడంతో ఈ తీర్పు దేశవ్యాప్తంగా ప్రాధాన్యం సంతరించుకుంది.



# ట్రంప్ ఫీజు ప్లాన్ కలకలం

**అంత సీన్ లేదన్న ఇరాన్.. హర్మూజ్ జలసంధిపై పోరు**

**చమురుకు గేటు ఎవరి చేతిలో?**

ప్రపంచ రాజకీయాల్లో మళ్లీ హర్మూజ్ జలసంధి కేంద్రబిందువైంది. మ్యాప్‌లో చిన్న సముద్ర మార్గంలా కనిపించినా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇది అత్యంత కీలకమైన ద్వారం. గల్ఫ్ దేశాల్లో ఉత్పత్తి అయ్యే భారీ స్థాయిలో ముడి చమురు, సహజ వాయువు ఈ మార్గం ద్వారానే ప్రపంచ మార్కెట్లకు చేరుతుంది. ప్రపంచ సముద్ర మార్గంలో రవాణా అయ్యే చమురులో దాదాపు ఐదో వంతు ఈ జలసంధి గుండా ప్రయాణిస్తుందని అంచనా. అందుకే హర్మూజ్‌లో ఉద్రిక్తత అంటే చమురు ధరలు, ఇంధన వ్యయం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తక్షణ ప్రభావం పడుతుంది.

### ఇరాన్ ఎందుకు వదలడం లేదు?

హర్మూజ్ జలసంధి ఉత్తర తీరం ఇరాన్ భూభాగానికి ఆనుకుని ఉంటుంది. దశాబ్దాలుగా ఈ ప్రాంతాన్ని తమ జాతీయ భద్రతలో భాగంగా ఇరాన్ భావిస్తోంది. ఈ మార్గంపై నియంత్రణ ఉంటే ప్రత్యర్థి దేశాలపై ఒత్తిడి తీసుకురావచ్చని టెహ్రాన్ అంచనా. అమెరికా ఆంక్షలు, సైనిక ఒత్తిళ్లు పెరిగిన ప్రతిసారి హర్మూజ్‌ను మూసివేస్తామని ఇరాన్ హెచ్చరిస్తూ వస్తోంది. తాజాగా అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంలో వాణిజ్య నౌకలకు సురక్షిత ప్రయాణం కల్పించాలని నిబంధన ఉన్నప్పటికీ, అమెరికా ప్రత్యామ్నాయ సముద్ర మార్గాన్ని ప్రోత్సహించడం ఆ ఒప్పందానికి విరుద్ధమని ఇరాన్ ఆరోపిస్తోంది.

### ట్రంప్ కొత్త ఎత్తుగడ

ఇదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. హర్మూజ్ జలసంధిని అమెరికానే రక్షిస్తోందని, ఇకపై ఆ రక్షణ ఉచితం కాదని ఆయన ప్రకటించారు. ఈ మార్గం ద్వారా లాభపడుతున్న సంపన్న దేశాలు రక్షణ కోసం అమెరికాకు ఫీజు చెల్లించాలని ట్రంప్ అభిప్రాయపడ్డారు. “మేమే గార్డియన్ ఏంజెల్‌గా ఉంటాం. మా సైనికులను ప్రమాదంలోకి పంపుతున్నాం. అందుకు ఖర్చు తిరిగి రావాలి” అని ఆయన వ్యాఖ్యానించారు.

### ఇరాన్ ప్రతిస్పందనతో కొత్త మలుపు

ట్రంప్ వ్యాఖ్యలు వెలువడిన కొద్దిసేపటికే ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. అమెరికా సైనిక చర్యల వల్ల పరిస్థితులు ప్రాణాంతకంగా మారాయని పేర్కొంది. పరిస్థితులు సాధారణ స్థితికి చేరిన తర్వాత మాత్రమే నౌకల అనుమతులపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. దీంతో హర్మూజ్‌పై నియంత్రణ అంశం మరింత ఉద్రిక్తంగా మారింది.

### భారత్‌పై ప్రభావం ఎంత?

హర్మూజ్‌లో ఉద్రిక్తత కొనసాగితే భారత్ వంటి చమురు దిగుమతులపై ఆధారపడే దేశాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు వచ్చే చమురులో పెద్ద భాగం ఈ మార్గం ద్వారానే చేరుతుంది. రవాణా అంతరాయం ఏర్పడితే చమురు ధరలు పెరగడం, పెట్రోల్, డీజిల్ ధరలపై ఒత్తిడి పెరగడం, దిగుమతి వ్యయం అధికమయ్యే అవకాశం ఉంటుంది. అందుకే హర్మూజ్ జలసంధి చుట్టూ జరుగుతున్న ప్రతి పరిణామాన్ని ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి. ఒక్క సముద్ర మార్గంపై ఆధిపత్యం కోసం సాగుతున్న ఈ పోరు ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తును కూడా ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంది.

# రామాలయ విరాళాల కేసు
# సీల్డ్ కవర్‌లో నివేదిక ఇవ్వండి



**జూలై 20లోపు నివేదిక**

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఎస్ఐటీ నివేదికను జూలై 20లోపు కోర్టుకు సమర్పిస్తామని తెలిపారు. ఎస్ఐటీ సభ్యుల వివరాలతో పాటు ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు పురోగతిని నివేదికలో పొందుపరుస్తామని చెప్పారు. విచారణకు భంగం కలగకుండా ఆ నివేదికను పిటిషనర్లకు ఇవ్వాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది.

**రామజన్మభూమి ట్రస్ట్‌కు నోటీసు**

**దోపిడీపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు**

అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం.. సిట్ ప్రస్తుత విచారణ స్థితిపై నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం విచారణ చేపట్టింది. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌కు కూడా నోటీసులు జారీ చేసింది. కేసు విచారణ కొనసాగుతున్నందున నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పించాలని స్పష్టం చేసింది.

### సీబీఐ దర్యాప్తు కోరుతూ పిటిషన్లు

ఈ కేసులో సీబీఐ దర్యాప్తు చేపట్టాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై ధర్మాసనం విచారణ జరిపింది. విరాళాల వ్యవహారానికి సంబంధించిన ఎలక్ట్రానిక్ ఆధారాలను భద్రపరచాలని కూడా పిటిషనర్లు కోరారు. మరోవైపు ఆర్జేడీ ఎంపీ సుధాకర్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌లో రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ పూర్తి ఆర్థిక లావాదేవీల వివరాలను బహిర్గతం చేయాలని విజ్ఞప్తి చేశారు. విదేశీ విరాళాల వివరాలను కూడా వెల్లడించాలని కోరారు. ఈ పిటిషన్లన్నింటినీ కలిపి సుప్రీంకోర్టు విచారిస్తోంది.

### విరాళాల వివాదం దేశవ్యాప్తంగా చర్చ

రామాలయ విరాళాల దుర్వినియోగం ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. విరాళాల లెక్కింపులో అక్రమాలు జరిగాయని ఎస్ఐటీ ప్రాథమిక నివేదికలో గుర్తించినట్లు ఇప్పటికే వెల్లడైంది. ఆ ఆధారాలతోనే ట్రస్ట్ ఎఫ్ఐఆర్ నమోదు చేయించింది. ఈ కేసులో ఇప్పటికే పలువురిని అరెస్టు చేశారు. ఆలయ విరాళాల భద్రతపై తీవ్ర సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### పారదర్శకతపై పెరుగుతున్న డిమాండ్

ఈ వివాదం తర్వాత ఆలయ నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత ఉండాలని రాజకీయ పార్టీలు, పిటిషనర్లు డిమాండ్ చేస్తున్నారు. విరాళాల సేకరణ, లెక్కింపు, భద్రత, వినియోగానికి సంబంధించి కఠిన పర్యవేక్షణ వ్యవస్థ అవసరమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు విచారణ పూర్తయ్యే వరకు ఎలాంటి నిర్ణయాలకు వెళ్లకూడదని కోర్టు స్పష్టం చేసింది. ఎస్ఐటీ నివేదిక ఆధారంగా తదుపరి విచారణలో మరిన్ని కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది.



**సీఈఓ నియామకానికి ప్రకటన**

**మూడేళ్ల పదవీకాలానికి దరఖాస్తు**

# అయోధ్య రామాలయానికి సీఈఓ

అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ కీలక నిర్ణయం తీసుకుంది. రామాలయ పరిపాలన, నిర్వహణ బాధ్యతలు చేపట్టే చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్.. సీఈఓ నియామకానికి దరఖాస్తులను ఆహ్వానించింది. ట్రస్ట్ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా అర్హతలు, నిబంధనలను విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థి ఆలయ పరిపాలనను సమర్థంగా నిర్వహించే పూర్తి బాధ్యతను చేపట్టనున్నారు.

### నాయకత్వమే ప్రధాన అర్హత

సీఈఓ పదవికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. పరిపాలన లేదా ఆర్థిక నిర్వహణ రంగంలో కనీసం 20 ఏళ్ల అనుభవం తప్పనిసరిగా ఉండాలని ట్రస్ట్ స్పష్టం చేసింది. చురుకుగా హిందూ ధర్మాన్ని ఆచరించే వ్యక్తి కావాలని పేర్కొంది. వైష్ణవ సంప్రదాయానికి చెందిన శ్రీరామ భక్తుడు అయితే అదనపు అర్హతగా పరిగణిస్తామని వెల్లడించింది. విద్యార్హతలు, అనుభవంతో పాటు వ్యక్తిగత లక్షణాలపైనా ట్రస్ట్ ప్రత్యేక దృష్టి పెట్టింది. నిజాయితీ, నిబద్ధత, పారదర్శకత, సమర్థ నాయకత్వ లక్షణాలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొంది. ఆలయ సిబ్బంది నిర్వహణ, ట్రస్ట్ నిర్ణయాల అమలు, ధార్మిక కార్యక్రమాల సమన్వయం, భక్తులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవడం సీఈఓ ప్రధాన బాధ్యతలుగా ఉంటాయని వివరించింది.

### విరాళాల వివాదం తర్వాత కీలక నిర్ణయం

ఎంపికైన అభ్యర్థి తొలి దశలో మూడేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. ఈ కాలమంతా అయోధ్యలోనే నివసించడం తప్పనిసరి. దరఖాస్తుల గడువు జూలై 18గా నిర్ణయించారు. ట్రస్ట్ ఏర్పాటు చేసిన ప్రత్యేక శోధన కమిటీ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలుస్తుంది. గడువు ముగిసిన నెల రోజుల్లో ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని ట్రస్ట్ తెలిపింది. ఇటీవల రామాలయ విరాళాల దుర్వినియోగ ఆరోపణలు వెలుగులోకి రావడంతో సీఈఓ నియామకం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో ఆలయ పరిపాలన మరింత పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో ట్రస్ట్ ముందుకు వచ్చినట్లు భావిస్తున్నారు. విశ్వ హిందూ పరిషత్ కూడా సీఈఓ నియామకాన్ని వ్యతిరేకించడం లేదని స్పష్టం చేసింది. అయితే ఈ ఎంపిక పూర్తిగా ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలోనే జరగాలని పేర్కొంది. పదవిని తప్పనిసరిగా పదవీ విరమణ చేసిన అధికారికే ఇవ్వాలనే అభిప్రాయాన్ని కూడా విహెచ్‌పీ తిరస్కరించింది. ఎంపిక ప్రమాణాలు, తుది నిర్ణయం పూర్తిగా ట్రస్ట్ పరిధిలోనే ఉండాలని స్పష్టం చేసింది.



రెడ్డెప్పగారి శ్రీనివాసులు రెడ్డి



చదిపిరాళ్ళ భూపేష్ రెడ్డి



విజయమ్మ



కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి



పరిటాల శ్రీరామ్




## నిర్ణయం ఎవరి పక్షం? సామాజిక సమతుల్యత కీలకం

ఈ ఎంపికలో సామాజిక వర్గాల సమీకరణ అత్యంత కీలకంగా మారింది. రెడ్డి, బలిజతో పాటు ఇతర వర్గాలకు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. ప్రాంతీయ సమతుల్యత కూడా అంతే ముఖ్యమైన అంశంగా మారింది. ఏ వర్గం అసంతృప్తికి గురికాకుండా నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత అధిష్టానంపై ఉంది. పార్టీ కోసం శ్రమించిన నాయకుడికి గుర్తింపు ఇవ్వాలా, అసంతృప్తిలో ఉన్న సీనియర్‌ను సంతృప్తిపరచాలా, భవిష్యత్ నాయకత్వాన్ని ప్రోత్సహించాలా అనే మూడు కోణాల మధ్యే ఈ ఎమ్మెల్సీ ఎంపిక జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ గత చరిత్రను పరిశీలిస్తే చివరి నిమిషం వరకు గోప్యత పాటించడం, ఊహించని నాయకుడికి అవకాశం కల్పించడం కొత్త విషయం కాదు. అందుకే ప్రస్తుతం వినిపిస్తున్న పేర్లలో ఎవరికైనా అవకాశం రావొచ్చు. ఒక్క ఎమ్మెల్సీ స్థానం రాయలసీమ రాజకీయాల భవిష్యత్ దిశను నిర్ణయించే అవకాశముండటంతో అందరి దృష్టి ఇప్పుడు అధిష్టానం నిర్ణయంపైనే నిలిచింది.

## రాయలసీమ ఎమ్మెల్సీ రేస్.. ఎవరికీ రాజకీయ వరం?

### ఒకే సీటు కోసం పోటీ... రాయలసీమలో పెరిగిన ఉత్కంఠ

# ఎవరి ధీమా వారిది!..

# సీమ ఎమ్మెల్సీ సీటు ఎవరిది?

**తెలుగుదేశం పార్టీలో గవర్నర్ కోటాలో భర్తీ కానున్న రెండు ఎమ్మెల్సీ స్థానాలపై తీవ్ర ఆసక్తి నెలకొంది. పార్టీ వర్గాల్లో జరుగుతున్న ప్రచారం ప్రకారం ఒక స్థానం ఉత్తరాంధ్రకు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. మిగిలిన ఒక్క స్థానం మాత్రం రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల నాయకులు తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. దీంతో ఈ ఒక్క సీటు కోసం రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. పార్టీ విధేయత, సీనియార్టీ, సామాజిక సమతుల్యత, భవిష్యత్ ఎన్నికల వ్యూహం వంటి అంశాలన్నీ ఈ ఎంపికలో కీలకంగా మారాయి.**

### అధిష్టానం ముందు క్లిష్ట పరీక్ష... శ్రీనివాసులు రెడ్డి పేరు చర్చల్లో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీ ముందున్న సవాళ్లు మరింత పెరిగాయి. ఎన్నికల్లో పార్టీ కోసం శ్రమించిన నాయకులకు తగిన గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉంది. వివిధ సామాజిక వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత కూడా నాయకత్వంపై ఉంది. నామినేటెడ్ పదవులన్నీ ఇప్పుడు రాజకీయంగా అత్యంత విలువైనవిగా మారాయి. అందుకే ఎమ్మెల్సీ ఎంపిక సాధారణ నిర్ణయం కాకుండా భవిష్యత్ రాజకీయాలకు దిశానిర్దేశం చేసే అంశంగా మారింది. రాయలసీమలో ఎక్కువగా వినిపిస్తున్న పేర్లలో మాజీ పోలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డెప్పగారి శ్రీనివాసులు రెడ్డి ఒకరు. గతంలో రాజ్యసభ సభ్యత్వంపై ఆయన పేరు బలంగా వినిపించినా చివరి నిమిషంలో అవకాశం చేజారింది. ఆ తర్వాత ఆయన అసంతృప్తి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్న కార్యక్రమానికి ఆయన హాజరు కాకపోవడం కూడా అనేక ఊహాగానాలకు కారణమైంది.

### బద్వేల్ సమీకరణలు.. అసంతృప్తికి పరిష్కారమా?

శ్రీనివాసులు రెడ్డికి ఎమ్మెల్సీ అవకాశం కల్పిస్తే పార్టీకి తిరిగి దగ్గరయ్యే అవకాశం ఉంటుందని ఆయన అనుచరులు భావిస్తున్నారు. సీనియర్ నాయకుడికి గౌరవం ఇవ్వడం ద్వారా జిల్లా రాజకీయాల్లో సమతుల్యత సాధించవచ్చని వారు చెబుతున్నారు. మరోవైపు కష్టకాలంలో పార్టీని వీడని నాయకులను పక్కనబెడితే తప్పు సందేశం వెళ్తుందని మరో వర్గం వాదిస్తోంది. దీంతో ఈ అంశంపై అధిష్టానం అత్యంత జాగ్రత్తగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ కుటుంబానికి కూడా ఎమ్మెల్సీపై ఆశలు ఉన్నాయి. రితేష్ రెడ్డిని ఇంఛార్జి బాధ్యతల నుంచి తప్పించిన సమయంలో కుటుంబానికి తగిన గౌరవం కల్పిస్తామని పార్టీ హామీ ఇచ్చిందనే ప్రచారం కొనసాగుతోంది. ఆ హామీకి కొనసాగింపుగా ఎమ్మెల్సీ పదవి దక్కుతుందనే ఆశతో విజయమ్మ వర్గం ఎదురు చూస్తోంది. పార్టీ కోసం దీర్ఘకాలంగా పని చేసిన కుటుంబానికి గుర్తింపు ఇవ్వాలని వారు కోరుతున్నారు. బలిజ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగలరాయుడు పేరు కూడా చర్చల్లో ఉంది. రాయలసీమలో బలిజ వర్గానికి రాజకీయ ప్రాధాన్యం పెంచాల్సిన అవసరం ఉందని కొందరు నాయకులు భావిస్తున్నారు. సామాజిక సమతుల్యత దృష్ట్యా ఈ అంశాన్ని అధిష్టానం పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### యువ నాయకత్వం... భూపేష్ రెడ్డికి విధేయత బలం

ప్రస్తుతం పార్టీ వర్గాల్లో ఎక్కువగా వినిపిస్తున్న పేరు చదిపిరాళ్ల భూపేష్ రెడ్డిదే. గత ఎన్నికల్లో కూటమి ధర్మాన్ని పాటిస్తూ జమ్మలమడుగు స్థానాన్ని బీజేపీ అభ్యర్థి ఆదినారాయణ రెడ్డికి వదులుకోవడం ద్వారా ఆయన పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్న నాయకుడిగా గుర్తింపు పొందారు. వ్యక్తిగత రాజకీయ అవకాశాన్ని త్యాగం చేసి కూటమి విజయాన్ని ముందుంచిన నాయకుడిగా ఆయనకు మంచి పేరు వచ్చింది. ప్రస్తుతం భూపేష్ రెడ్డి కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. యువతలో ఆయనకు మంచి ఆదరణ ఉంది. పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. జిల్లా స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. నారా లోకేష్‌కు సన్నిహితంగా పనిచేస్తున్న నాయకుల్లో ఆయన ఒకరనే ప్రచారం కూడా కొనసాగుతోంది.

### కర్నూలు, చిత్తూరు.. అనంతపురం ఆశలు

అనంతపురం జిల్లాలో కూడా ఎమ్మెల్సీ పదవిపై ఆశలు భారీగానే ఉన్నాయి. యువ నాయకుడు పరిటాల శ్రీరామ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. పరిటాల కుటుంబానికి పార్టీతో ఉన్న అనుబంధం, యువతలో ఆయనకు ఉన్న గుర్తింపు, భవిష్యత్ నాయకత్వ సామర్థ్యం వంటి అంశాలు ఆయనకు అనుకూలంగా మారే అవకాశాలు కనిపిస్తు న్నాయి. కర్నూలు జిల్లాలో కోట్ల కుటుంబానికి తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. ప్రస్తుతం కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి డోన్ ఎమ్మెల్యే గా ఉన్నారు. ఆ దిశగా ఎమ్మెల్సీ అవకాశం పరిశీలనలోకి రావచ్చని అంచనాలు ఉన్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత జిల్లా కావడంతో అక్కడి నాయకులు కూడా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అయితే ఇప్పటికే జిల్లాకు తగిన ప్రాతినిధ్యం ఉండటంతో ఈసారి అవకాశం ఇతర జిల్లాలకు వెళ్లవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



# అద్భుతాలు.. కాంట్రవర్సీలు

## మోదీకి 35వ అంతర్జాతీయ గౌరవం

### ప్రపంచ వేదికపై మరో మైలురాయి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇండోనేషియా అత్యున్నత పౌర పురస్కారం 'బింటాంగ్ ఆదిపూర్ణ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియా' ప్రదానం చేసింది. ఇండోనేషియా పర్యటన సందర్భంగా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఈ గౌరవాన్ని అందజేశారు. ఈ పురస్కారంతో 2016 నుంచి మోదీ అందుకున్న అంతర్జాతీయ రాష్ట్ర గౌరవాల సంఖ్య 35కు చేరింది. ప్రపంచ దేశాలతో భారత్ పెంచుకుంటున్న వ్యూహాత్మక సంబంధాలకు గుర్తింపుగా ఈ సత్కారాన్ని రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

### రెండు నెలల్లో ఐదు గౌరవాలు

గత రెండు నెలల్లోనే మోదీకి ఐదు దేశాలు అత్యున్నత పురస్కారాలు అందించాయి. మే నెలలో స్వీడన్, నార్వే సత్కరించగా, జూన్‌లో స్లోవేకియా, సీషెల్స్ గౌరవించాయి. ఇప్పుడు ఇండోనేషియా కూడా అదే జాబితాలో చేరింది. వరుసగా విదేశీ ప్రభుత్వాల నుంచి లభిస్తున్న ఈ గౌరవాలు భారత్ అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతున్న ప్రభావానికి నిదర్శనమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంటోంది.

### సీషెల్స్ పురస్కారంపై వివాదం

ఇటీవల సీషెల్స్ ప్రభుత్వం మోదీకి ప్రదానం చేసిన 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' ప్రత్యేక పురస్కారం వివాదానికి దారితీసింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన సర్టిఫికెట్‌లో అక్షరదోషాలు కనిపించడంతో అది కృత్రిమ మేధతో రూపొందించిందనే విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సీషెల్స్ విదేశాంగ శాఖ అధికారికంగా స్పందించింది. ఆ పురస్కారం పూర్తిగా అధికారికమేనని, వైరల్ అయిన చిత్రం తుది సర్టిఫికెట్ కాదని స్పష్టం చేసింది.

### స్పష్టత ఇచ్చిన సీషెల్స్ ప్రభుత్వం

వైరల్ అయిన పత్రం తుది రూపం కాదని, తొందరపాటులో డిజిటల్ డిజైన్ ప్రక్రియలో తయారైన ముసాయిదా మాత్రమేనని సీషెల్స్ విదేశాంగ శాఖ వెల్లడించింది. అందులో అక్షరదోషాలు ఉన్న విషయాన్ని అంగీకరిస్తూ విచారం వ్యక్తం చేసింది. తుది ఆమోదం పొందిన అధికారిక సర్టిఫికెట్‌లో అలాంటి పొరపాట్లు లేవని స్పష్టం చేసింది. దీంతో ఆ వివాదానికి ప్రభుత్వం వివరణ ఇచ్చినట్లైంది.

### ప్రపంచ వేదికపై భారత్‌కు గుర్తింపు

ఇటీవలి కాలంలో విదేశీ పర్యటనల సందర్భంగా మోదీకి వరుసగా లభిస్తున్న రాష్ట్ర గౌరవాలు ప్రపంచ దేశాలతో భారత్ బలోపేతం చేస్తున్న సంబంధాలను ప్రతిబింబిస్తున్నాయని దౌత్య నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఇండోనేషియా నుంచి లభించిన 35వ అంతర్జాతీయ గౌరవం కూడా అదే దిశలో మరో కీలక మైలురాయిగా నిలిచింది. భారత్‌కు అంతర్జాతీయ వేదికపై పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ఈ పరిణామాలు మరింత బలపరుస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

**ఎన్నికల వేళ సంక్షేమ హామీలతో ప్రజలను ఆకట్టుకున్న మహారాష్ట్ర ప్రభుత్వం, ఇప్పుడు అదే పథకంలో భారీ కోతలు విధించడం రాజకీయ దుమారం రేపుతోంది. మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని ప్రకటించిన 'మాజీ లాడ్కీ బహిన్ యోజన'లో ఏకంగా 92 లక్షల మంది లబ్ధిదారుల పేర్లను తొలగించడం తీవ్ర చర్చకు దారితీసింది. ఎన్నికల ముందు అందరికీ వర్తిస్తుందన్న హామీ, ఎన్నికల తర్వాత అర్హతల పేరుతో భారీ వడపోత జరగడం విమర్శలకు తావిస్తోంది. ఇది నిజంగా అర్హుల గుర్తింపా? లేక ఎన్నికల హామీలకు పరిమితులున్నాయనే సంకేతమా? అనే ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లోనే కాదు, దేశవ్యాప్తంగా సంక్షేమ పథకాల అమలుపైనా చర్చకు కారణమవుతున్నాయి.**



# మహా సర్కార్ ఎన్నికల హామీలు

## ముందు నుయ్యి.. వెనుక గొయ్యి

### 'లాడ్కీ బహిన్'లో 92 లక్షల మందికి షాక్

### లబ్ధిదారుల జాబితాలో భారీ మార్పు

ఎన్నికల సమయంలో సంక్షేమ పథకాలు రాజకీయాల్లో ప్రధాన అస్త్రంగా మారడం కొత్త విషయం కాదు. అయితే మహారాష్ట్రలో అధికార కూటమి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన 'మాజీ లాడ్కీ బహిన్ యోజన' ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. ఒకప్పుడు కోట్లాది మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పుడు ఏకంగా 92 లక్షల మంది మహిళల పేర్లను లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించింది. దీంతో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, ఎన్నికల తర్వాత తీసుకున్న నిర్ణయాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ఎందుకు తొలగించారు?

ప్రభుత్వం వివరణ ప్రకారం ఈ-కేవైసీ పూర్తి చేయకపోవడం ప్రధాన కారణంగా నిలిచింది. సుమారు 50 నుంచి 55 లక్షల మంది మహిళలు నిర్ణీత గడువులో ఈ ప్రక్రియ పూర్తి చేయలేదు. మరో 12 లక్షల మందికి కుటుంబ వార్షిక ఆదాయం అర్హత పరిమితిని మించిందని అధికారులు గుర్తించారు. 65 ఏళ్ల వయసు దాటిన 4.5 లక్షల మందిని కూడా జాబితా నుంచి తొలగించారు. పరిశీలనలో సుమారు 14 వేల మంది పురుషులు కూడా ఈ పథకం కోసం దరఖాస్తు చేసిన విషయం బయటపడటంతో వారి పేర్లను కూడా తొలగించారు.

### బీడ్ జిల్లాలోనే అత్యధిక కోత

మొత్తం తొలగింపుల్లో అత్యధిక ప్రభావం బీడ్ జిల్లాపైనే పడింది. ఒక్క ఈ జిల్లాలోనే దాదాపు 28 లక్షల మంది మహిళల పేర్లు జాబితా నుంచి తొలగించబడినట్లు సమాచారం. తొలుత 2.4 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నట్లు ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పుడు దాదాపు 38 శాతం మందిని తొలగించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. తిరిగి ధృవీకరణ పూర్తయిన తర్వాతే తుది లబ్ధిదారుల సంఖ్య వెల్లడిస్తామని ప్రభుత్వం చెబుతోంది.

### ఖజానాపై భారీ భారం

ఈ పథకంపై మరో ఆసక్తికర అంశాన్ని భారత నియంత్రణ, మహా లెక్కల పరిశీలకుడు (సీఏజీ) నివేదిక వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ పథకం వల్ల రాష్ట్ర ఖజానాపై భారీ భారం పడుతోందని నివేదిక పేర్కొంది. రూ.3,541 కోట్ల వ్యయాన్ని సమర్థించడం కష్టమని అభిప్రాయపడింది. మహిళా సంక్షేమంపై వ్యయం ఒక్క ఏడాదిలోనే వందల కోట్ల నుంచి రూ.33 వేల కోట్లకు పైగా పెరగడం కూడా ఆందోళన కలిగించే అంశంగా పేర్కొంది.

### రాజకీయంగా కొత్త చర్చ

లబ్ధిదారుల జాబితాలో భారీ కోత రాజకీయంగా కూడా కొత్త చర్చకు దారితీసింది. ఎన్నికల ముందు సంక్షేమ హామీలతో ప్రజలను ఆకర్షించడం, ఎన్నికల తర్వాత అర్హతల పేరుతో లబ్ధిదారుల సంఖ్య తగ్గించడం సరైందేనా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం మాత్రం అర్హులైన వారికి మాత్రమే ప్రయోజనం అందించడమే లక్ష్యమని చెబుతోంది. ఈ వ్యవహారం మహారాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా సంక్షేమ పథకాల అమలుపై కొత్త చర్చకు తెరలేపింది.



## డ్రెస్సింగ్‌రూమ్‌లో కలకలం
## ప్రపంచకప్ గెలిచి వారంలోనే
## ఆస్ట్రేలియా క్రికెట్‌లో కుదుపు

# స్టార్ క్రికెటర్‌పై ఆరోపణలు

టీ20 ప్రపంచకప్ విజయోత్సాహంలో ఉన్న ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టును ఊహించని వివాదం చుట్టుముట్టింది. జట్టు స్టార్ ఆల్‌రౌండర్ అష్లీ గార్డ్నర్ వ్యక్తిగత జీవితం ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఆమెతో విడిపోయిన జీవిత భాగస్వామి మోనికా రైట్ సోషల్ మీడియాలో చేసిన ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. సహచర క్రికెటర్ జార్జియా వోల్‌తో గార్డ్నర్‌కు సంబంధం ఉందంటూ ఆమె బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆస్ట్రేలియా క్రికెట్‌లో సంచలనంగా మారాయి.



**సోషల్ మీడియాలో నేరుగా ఆరోపణ**

బ్రిటిష్ మీడియా సంస్థ డైలీ మెయిల్ గార్డ్నర్ వివాహ బంధం గురించి కథనం ప్రచురించిన కొద్ది సేపటికే మోనికా రైట్ స్పందించారు. ఆ కథనంలో పేరు స్పష్టంగా లేకపోవడంతో ఆమె ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో జార్జియా వోల్ ఫొటోను పోస్ట్ చేస్తూ, "నా భార్య నన్ను మోసం చేసిన వ్యక్తి ఇదే" అని ఆరోపించారు. ఈ పోస్టు క్షణాల్లో వైరల్ కావడంతో ప్రపంచ క్రికెట్ వర్గాల్లో చర్చ మొదలైంది.

**ప్రపంచకప్ సమయంలోనే విభేదాలా?**

ఈ ఏడాది మహిళల వన్డే ప్రపంచకప్ సమయంలోనే గార్డ్నర్ వ్యక్తిగత జీవితంలో సమస్యలు మొదలయ్యాయని విదేశీ మీడియా కథనాలు పేర్కొన్నాయి. టోర్నీ మధ్యలో మోనికా రైట్ భారత్‌కు వచ్చినట్లు సమాచారం. ఆ తర్వాత ఇద్దరి మధ్య దూరం మరింత పెరిగిందని, ఆస్ట్రేలియాకు తిరిగి వెళ్లిన తర్వాత గార్డ్నర్ తమ సంబంధంలో మార్పు వచ్చిందని చెప్పినట్లు నివేదికలు వెల్లడించాయి. కొద్ది నెలల్లోనే ఇద్దరూ విడిపోయినట్లు సమాచారం.

**కుటుంబ కలలు... వివాదంగా మారిన జీవితం**

ఇద్దరూ కుటుంబాన్ని విస్తరించాలనే ప్రణాళికలు కూడా వేసుకున్నారని కథనాలు చెబుతున్నాయి. అయితే విడిపోయే సమయంలో గార్డ్నర్ సిడ్నీలోని ఇంటిని వదిలి వెళ్లడంతో పాటు మ్యారేజ్ రింగ్స్ అక్కడే వదిలేసినట్లు సమాచారం. ఈ పరిణామం ఆస్ట్రేలియా మహిళల జట్టు డ్రెస్సింగ్‌రూమ్‌లో కూడా ప్రధాన చర్చగా మారిందని విదేశీ మీడియా పేర్కొంది.

**అధికారిక స్పందన లేదు**

ఈ ఆరోపణలపై క్రికెట్ ఆస్ట్రేలియా ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. మీడియా ప్రశ్నించినా వ్యాఖ్యానించేందుకు నిరాకరించింది. అష్లీ గార్డ్నర్ కూడా ఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు. ప్రస్తుతం ఆమె ఆస్ట్రేలియా మహిళల జట్టుకు సహాయ ఉపకెప్టెన్‌గా కొనసాగుతున్నారు. ఇటీవలే ఐసీసీ మహిళల వన్డే ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును కూడా అందుకున్నారు. అయితే సోషల్ మీడియాలో వచ్చిన ఆరోపణలు నిజమా కాదా అన్నది ఇప్పటివరకు అధికారికంగా ధృవీకరించబడలేదు. దీంతో ఈ వ్యవహారం ఎలా ముగుస్తుందన్నది ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో ఆసక్తికర చర్చగా మారింది.



# లార్డ్స్‌లో భారత్ జయభేరి

**ఇంగ్లండ్‌పై ఘన విజయం**
**చరిత్ర సృష్టించిన మహిళల జట్టు**
**270 పరుగుల తేడాతో గెలుపు**
**యశస్తిక భాటియా సెంచరీ రికార్డు**

భారత మహిళల క్రికెట్ జట్టు లండన్‌లోని చారిత్రక లార్డ్స్ మైదానంలో అరుదైన ఘనత సాధించింది. తొలిసారిగా నిర్వహించిన మహిళల టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను 270 పరుగుల భారీ తేడాతో ఓడించి చరిత్ర సృష్టించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలో బ్యాటర్లు, బౌలర్లు సమష్టిగా రాణించి ప్రత్యర్థికి ఏ దశలోనూ అవకాశం ఇవ్వలేదు. యశస్తిక భాటియా చారిత్రక సెంచరీతో లార్డ్స్ ఆనర్స్ బోర్డులో స్థానం సంపాదించగా, క్రాంతి గౌడ్ ఐదు వికెట్లతో మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పింది. స్నేహ్ రాణా కీలక వికెట్లతో విజయాన్ని ఖాయం చేసింది. లార్డ్స్‌లో మహిళల టెస్టు గెలిచిన తొలి జట్టుగా భారత్ నిలవడం భారత క్రికెట్ చరిత్రలో మరో స్వర్ణ అధ్యాయంగా నిలిచింది. భారత మహిళల క్రికెట్ జట్టు లండన్‌లోని చారిత్రక లార్డ్స్ మైదానంలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించింది. తొలిసారిగా నిర్వహించిన మహిళల టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను 270 పరుగుల భారీ తేడాతో ఓడించి చరిత్ర సృష్టించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలో భారత జట్టు నాలుగు రోజుల పాటు ప్రతి విభాగంలో ఆధిపత్యం చాటింది. లార్డ్స్‌లో మహిళల టెస్టులో విజయం సాధించిన తొలి జట్టుగా భారత్ రికార్డు నెలకొల్పింది. ఈ ఘన విజయంతో ఇంగ్లండ్ గడ్డపై భారత మహిళల టెస్టు జట్టు అజేయ ప్రస్థానం కొనసాగింది.

**బ్యాటర్ల అద్భుత ప్రదర్శన**

మొదటి ఇన్నింగ్స్‌లో 285 పరుగులు చేసిన భారత్‌కు ఉప కెప్టెన్ స్మృతి మంధానా 83 పరుగులతో బలమైన పునాది వేశారు. హర్మన్‌ప్రీత్ కౌర్ 58, దీప్తి శర్మ 57 పరుగులతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పారు. రెండో ఇన్నింగ్స్‌లో యశస్తిక భాటియా అద్భుతంగా ఆడి 113 పరుగులు సాధించింది. లార్డ్స్‌లో టెస్టు సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా ఆమె చరిత్రలో నిలిచింది. స్మృతి మరోసారి 70 పరుగులతో రాణించగా, రిచా ఘోష్ వేగవంతమైన అర్ధశతకంతో జట్టు స్కోరును 341/7 వద్ద డిక్లేర్ చేసేలా చేసింది.

**కుప్పకూలిన ఇంగ్లండ్**

బౌలింగ్‌లో యువ పేసర్ క్రాంతి గౌడ్ అసాధారణ ప్రదర్శన కనబరిచింది. తొలి ఇన్నింగ్స్‌లో 37 పరుగులకే ఐదు వికెట్లు పడగొట్టి ఇంగ్లండ్‌ను 170 పరుగులకే కట్టడి చేసింది. దీంతో భారత్‌కు 115 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. 457 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో కూడా భారత బౌలర్లకు ఎదురులేకపోయింది. స్నేహ్ రాణా నాలుగు వికెట్లు తీసి ప్రత్యర్థి ఆశలను పూర్తిగా చెదరగొట్టింది. క్రాంతి గౌడ్, దీప్తి శర్మ కీలక వికెట్లు సాధించి విజయంలో భాగమయ్యారు.

**భారతకు గర్వకారణం**

మ్యాచ్ ముగిసిన తర్వాత భారత ఆటగాళ్ల సంబరాలు అభిమానులను అలరించాయి. ఐసీసీ ఛైర్మన్ జయ్ షా, దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ మైదానంలోనే జట్టును అభినందించారు. ఇటీవల పురుషుల జట్టు ఇంగ్లండ్ పర్యటనలో నిరాశపరిచిన సమయంలో మహిళల జట్టు సాధించిన ఈ చారిత్రక విజయం భారత క్రికెట్‌కు కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చింది. లార్డ్స్ వంటి ప్రతిష్ఠాత్మక వేదికపై సాధించిన ఈ విజయం భారత మహిళల క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనుంది.



# ఇంగ్లండ్ టెస్టు కోచ్ రేసులో రాహుల్ ద్రావిడ్

## ఫుల్‌టైమ్ కోచింగ్‌పై ఆసక్తి లేదన్న ద వాల్



ఇంగ్లండ్ టెస్టు జట్టుకు కొత్త ప్రధాన కోచ్ ఎంపిక ప్రక్రియలో భారత దిగ్గజం రాహుల్ ద్రావిడ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. టెస్టు క్రికెట్‌లో నిరాశాజనక ఫలితాల తర్వాత బ్రెండన్ మెకల్లమ్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించడంతో కొత్త కోచ్ కోసం ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు అన్వేషణ ప్రారంభించింది. ఈ జాబితాలో ద్రావిడ్‌తో పాటు ఆండీ ఫ్లవర్, రిచర్డ్ డాసన్ పేర్లు కూడా ఉన్నాయి. భారత జట్టును 2024 టీ20 ప్రపంచకప్ విజేతగా నిలబెట్టిన ద్రావిడ్, 2023 ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు కూడా చేర్చారు. ఆటపై లోతైన అవగాహన, క్రమశిక్షణతో కూడిన ప్రణాళికల కారణంగా ఆయనను అత్యుత్తమ కోచ్‌లలో ఒకరిగా గుర్తిస్తున్నారు. అయితే పూర్తి సమయ కోచ్‌గా పనిచేయాలనే ఆసక్తి ద్రావిడ్‌కు లేదని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. అయినప్పటికీ టెస్టు జట్టు కోచ్ పదవి ఆయనకు ఇంటి వద్ద ఎక్కువ సమయం గడిపే అవకాశాన్ని కల్పిస్తుందని, అందుకే ఇంగ్లండ్ బోర్డు ఆయన అభిప్రాయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయొచ్చని నివేదికలు వెల్లడించాయి. దీంతో ఇంగ్లండ్ కోచ్ ఎంపికపై ఆసక్తి నెలకొంది.

# 18 ఏళ్ల బంధానికి తెర

## చెన్నై సూపర్ కింగ్స్‌కు ఫ్లెమింగ్ గుడ్‌బై

## కొత్త కోచ్‌గా హేమంగ్ బదానీ

ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు 18 ఏళ్ల అనుబంధానికి ముగింపు పలుకుతూ ప్రధాన కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌తో విడిపోతున్నట్లు ప్రకటించింది. జట్టు యాజమాన్యంతో జరిగిన చర్చల అనంతరం పరస్పర అంగీకారంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. 2008లో ఆటగాడిగా సీఎస్‌కేలో చేరిన ఫ్లెమింగ్, 2009 నుంచి ప్రధాన కోచ్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయన మార్గదర్శకత్వంలో చెన్నై ఐదు ఐపీఎల్ టైటిళ్లు, రెండు చాంపియన్స్ లీగ్ టీ20 ట్రోఫీలు గెలుచుకుంది. మొత్తం 12 సార్లు ప్లేఆఫ్‌కు చేరి, 10 ఫైనల్స్ ఆడిన ఘనతను కూడా సాధించింది. గత మూడు సీజన్లుగా సీఎస్‌కే ప్లేఆఫ్‌కు చేరకపోవడంతో కోచింగ్ విభాగంలో మార్పులకు శ్రీకారం చుట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్‌కు కోచ్‌గా ఉన్న మాజీ భారత క్రికెటర్ హేమంగ్ బదానీ పేరు కొత్త ప్రధాన కోచ్ రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. త్వరలోనే సీఎస్‌కే యాజమాన్యం అధికారికంగా కొత్త కోచ్‌ను ప్రకటించే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.




# సీఎస్‌కే నా గుండెల్లోనే ఉంటుంది

## ఫ్లెమింగ్ భావోద్వేగ వీడ్కోలు..

చెన్నై సూపర్ కింగ్స్‌తో 18 ఏళ్ల అనుబంధానికి ముగింపు పలికిన ప్రధాన కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ భావోద్వేగ సందేశం విడుదల చేశారు. క్రీడల్లో 18 సంవత్సరాలు అంటే ఒక జీవితకాలంతో సమానమని పేర్కొన్న ఆయన, సీఎస్‌కేలో గడిపిన సమయం తన కోచింగ్ కెరీర్‌లో అత్యంత గొప్ప గౌరవంగా నిలిచిందని చెప్పారు. జట్టుతో కలిసి సాధించిన ప్రతి విజయంపై తాను గర్వపడుతున్నానని వెల్లడించారు. సీఎస్‌కేతో కలిసి ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందుకున్నామని, కష్టమైన పరిస్థితులను అధిగమిస్తూ ఎన్నో మధుర జ్ఞాపకాలను సృష్టించుకున్నామని ఫ్లెమింగ్ అన్నారు. ఆ అనుభవాలు జీవితాంతం తనతోనే ఉంటాయని, ఈ ప్రయాణం ఎప్పటికీ మరచిపోలేనిదని పేర్కొన్నారు. చెన్నై సూపర్ కింగ్స్ ఎప్పటికీ తన హృదయానికి అత్యంత దగ్గరగా ఉంటుందని ఫ్లెమింగ్ స్పష్టం చేశారు. ఇకపై కోచ్‌గా కాకపోయినా జట్టుకు అభిమానిగా ఎప్పుడూ మద్దతుగా ఉంటానని చెప్పారు. ఫ్లెమింగ్ సందేశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా, సీఎస్‌కే అభిమానులు ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగంగా స్పందిస్తున్నారు. ఆయన నాయకత్వంలో చెన్నై 5 ఐపీఎల్ టైటిళ్లు సాధించి ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటిగా నిలిచింది.

# ఇంగ్లండ్ టెస్టు కోచ్ రేసులో ఆండీ ఫ్లవర్

## మెకల్లమ్‌కు ప్రత్యామ్నాయ వేటలో ఈసీబీ

## ఐపీఎల్ బాధ్యతలే ఫ్లవర్‌కు అడ్డంకా?



ఇంగ్లండ్ టెస్టు జట్టుకు కొత్త ప్రధాన కోచ్ ఎంపిక ప్రక్రియ వేగం అందుకుంది. వరుస పరాజయాలు, యాషెస్ సిరీస్‌లో ఘోర వైఫల్యం తర్వాత బ్రెండన్ మెకల్లమ్‌ను టెస్టు కోచ్ బాధ్యతల నుంచి తప్పించిన ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు.. ఈసీబీ ఇప్పుడు అనుభవజ్ఞుడైన ఆండీ ఫ్లవర్ వైపు చూస్తోంది. అయితే వన్డే, టీ20 జట్లకు మెకల్లమ్ కొనసాగనున్నారు. 2009 నుంచి 2014 వరకు ఇంగ్లండ్ కోచ్‌గా పనిచేసిన ఆండీ ఫ్లవర్ జట్టుకు మూడు యాషెస్ విజయాలు అందించారు. ప్రస్తుతం ఆయన ఐపీఎల్ ఫ్రాంచైజీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ప్రధాన కోచ్‌గా ఉన్నారు. దీంతో రెండు బాధ్యతలను ఒకేసారి నిర్వహించే అవకాశాన్ని ఈసీబీ పరిశీలిస్తున్నట్లు సమాచారం. క్రికెట్ ప్రపంచంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కోచ్‌లు ఫ్రాంచైజీ క్రికెట్‌తో పాటు జాతీయ జట్టును కూడా చూసే విధానాన్ని పరిశీలిస్తామని ఈసీబీ సీఈఓ రిచర్డ్ గోల్డ్ తెలిపారు.



## ఆకట్టుకుంటున్న 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' టీజర్

మలయాళ స్టార్ ఫహాద్ ఫాజిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. తొలి సారిగా పూర్తి స్థాయి తెలుగు పాత్రలో కనిపిస్తున్న ఫహాద్ ఇందులో మెజీషియన్‌గా నటిస్తున్నారు. మ్యాజిక్ చేస్తూ చిన్నారిని మాయంచేసే ప్రయత్నంలో ఊహించని పరిణామాలు చోటుచేసుకోవడం టీజర్‌లో ఆసక్తిని పెంచుతోంది. హారర్, ఫాంటసీ, థ్రిల్లర్ అంశాలతో రూపొందిన విజువల్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. శశాంక్ యేలేటి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని శోభు యార్లగడ్డ, ఎస్.ఎస్. కార్తికేయ నిర్మిస్తున్నారు.





# మహేష్ కుటుంబంలో పెళ్లి సందడి

సూపర్ స్టార్ మహేష్ బాబు మేనల్లుడు సిద్దార్థ్ గల్లా త్వరలో పెళ్లి పీటలెక్కనున్నారు. కొరియాకు చెందిన హాయిన్ (జిన్నీ)తో ఆయన నిశ్చితార్థం కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను నమ్రత శిరోద్కర్ సోషల్ మీడియాలో పంచుకుంటూ కాబోయే దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి మహేష్ బాబు కుటుంబ సభ్యులు, సన్నిహితులు హాజరయ్యారు. దివంగత రమేష్ బాబు కుమార్తె భారతి కూడా పాల్గొనడం విశేషం. గల్లా జయదేవ్ చిన్న కుమారుడైన సిద్దార్థ్ ప్రస్తుతం కుటుంబ వ్యాపారాలను చూసుకుంటుండగా, త్వరలో కొత్త జీవితాన్ని ప్రారంభించనున్నారు. అభిమానులు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

This newspaper is Owned and Published by **KANTIPUDI RAVENDRA** from H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072. Editor: **KANTIPUDI RAVENDRA**, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com. Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085